ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3

అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 11 మే 2024



కూటమికే మొగ్గు

ధరల పెరుగుదల, విద్యుత్, ఆర్టీసీ చార్జీల పెంపుతో వైసీపీ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

· 5లో





అప్పన్న దర్శనం కోసం క్యూలో వేచివున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) చందనోత్సవం సందర్భంగా పట్టు వస్త్రాలు, చందనం సమర్పిస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు

నిజరూపంలో అప్పన్న దర్శనం

దర్శించి పులకించిన భక్తజనం

- సంప్రదాయబద్ధంగా చందనోత్సవం
- అనువంశిక ధర్మకర్త కుటుంబీకులకు తొలి దర్శనం
- తెల్లవారుజామున 2.30 గంటల నుంచి సామాన్య భక్తులకు అనుమతి
- వేలాది మంది రాక
- ఉత్సవం అనంతరం సహస్ర ఘటాభిషేకం

సింహాచలం, మే 10: సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం శుక్రవారం సంప్రదాయబద్ధంగా జరిగింది. భక్తులు స్వామి వారి నిజరూపాన్ని దర్శించి తరించారు. ఉత్సవంలో భాగంగా గురువారం అర్ధరాత్రి 12.45 గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. పాంచరాత్రాగమ శాస్త్రా సంప్రదాయానుసారం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనములు, ఋత్విగ్వరణములు, పంచకలశావాహనం చేశారు. స్వామి వారికి మంత్రపూర్వకంగా కళావిసర్జనం చేసి, కలశంలో నిక్షిప్తం చేశారు. అనంతరం ఆలయ అర్చకులు కళ్లకు గంతలు కట్టుకుని వెండి బొరిగెలతో స్వామి వారిపై పూతగా ఉండే చందనాన్ని తొలగించారు. ఆ తరువాత ప్రభాత ఆరాధనలు చేసి షోడశోపచారాలు సమర్పించి మంగళ నీరాజనాలు సమర్పించారు. అనంతరం అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం దేవాలయ అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు, తదితర పూసపాటి కుటుంబీకులకు తొలిదర్శనం తెల్లవారుజామున రెండు గంటలకు కల్పించారు. అంతరాలయంలో అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యుల గోత్రనామాలతో పూజలు చేసి చందన కిరీటాన్ని శిరస్సున ఉంచారు. శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ వేదపండితులు ఆశీర్వదించగా, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి, ముఖ్య ఉత్సవ అధికారి కోదూరి రామచంద్రమోహన్ శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. పూసపాటి వంశీయుల దర్శనం అనంతరం వేకువజామున 2.30 గంటల నుంచి సామాన్య భక్తులకు దర్శనం కల్పించారు. చందనోత్సవాన్ని పురస్కరించుకుని అశోక్‌గజపతిరాజు దంపతులు, తితిదే తరఫున వేదపండితులు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కరికల్ వలవెన్ అప్పన్నస్వామికి పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తుల దర్శనం అనంతరం రాత్రి తొమ్మిది గంటలకు సంప్రదాయ పరులైన శ్రీవైష్ణవస్వాములు గంగధార నుంచి తీసుకువచ్చిన పవిత్ర

... మిగతా 6వ పేజీలో

వర్షంతో ఊరట



చోడవరంలో వర్షం

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ

- సాయంత్రం జోరువాన
- జిల్లా అంతటా ఇదే పరిస్థితి

అనకాపల్లి టౌన్/చోడవరం/మాడుగుల/కోటవురట్ల, మే 10: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. సాయంత్రం 4 గంటల తరువాత ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడికి అల్లాడిన జనం సాయంత్రం కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు. వర్షం వల్ల అనకాపల్లిలో విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు కూడా సబ్‌వే లు మీదుగా రాకపోకలు సాగించాయి. చోడవరంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో సుమారు గంట పాటు భారీగా వర్షం కురిసింది. భారీ వర్షం వల్ల పట్టణంలో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుచ్చెయ్యపేటలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రావికమతంలో సాయంత్రం ఐదు గంటలకు వర్షం పడింది. రోలుగుంటలో సాయంత్రం కురిసిన వర్షానికి జనం ఊరట చెందారు. దేవరాపల్లిలో సాయంత్రం కురిసిన వర్షానికి జనం సేదతీరారు. అలాగే మాడుగుల, కోటవురట్ల, ఎలమంచిలిలో కూడా సాయంత్రం వర్షం కురిసింది.

వైసీపీపై అన్నదాతల అసంతృప్తి



ఐదేళ్లలో దగా పడ్డామని ఆవేదన

- ఉద్యాన పంటలకు ప్రోత్సాహక పథకాలు నిలిపివేత
- బిందుసేద్యం, వ్యవసాయ యంత్రపరికరాల పంపిణీకి బ్రేకులు
- భరోసా ఇవ్వని రైతు భరోసా కేంద్రాలు
- చెరకు రైతులు కుదేలు
- కళ తప్పిన వైఎస్సార్ జలకళ
- రీ సర్వేలో తప్పిదాలతో ఎనలేని భారం
- ప్రహసనంగా మారిన 9 గంటల విద్యుత్ సరఫరా
- సర్కారు తీరుపై రగిలిపోతున్న రైతాంగం

చోడవరం, మే 10:

ఓ వైపు పంటలకు గిట్టుబాటు ధర లేదు. మరో వైపు పెరిగిన పెట్టుబడులతో వ్యవసాయం భారంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో అండగా ఉండవలసిన వైసీపీ ప్రభుత్వం ఎటువంటి సాయం అందించకపోవడంపై రైతులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతాంగానికి అవసరమైన వ్యవసాయ పరికరాల దగ్గర నుంచి వివిధ పథకాల ద్వారా రాయితీలపై విత్తనాలు, సబ్సిడీ పథకాలు, డ్రిప్ ఇరిగేషన్, ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలతో అన్నదాతలకు ఇతోధికంగా సాయం అందించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం రైతు భరోసాతో సరిపెట్టి అన్నదాతలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుండడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో అన్నదాతలు సర్కారు తీరుపై పెదవి విరుస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో వరి తరువాత అత్యధికంగా సాగయ్యేది చెరకు పంట. జిల్లాలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలు మూతపడడం, గోవాడ కూడా ఒడిదుడుకుల్లో ఉండడంతో చెరకు సాగు చేసే రైతులు సాగుకు స్వస్తిపలికారు. ఇదే సమయంలో బెల్లం ధరలు కూడా పడిపోవడంతో చెరకు రైతులకు సాగు విడిచిపెట్టడం తప్పితే మరో దారిలేకుండా పోయింది. చెరకు నుంచి సరుగుడుకు మళ్లిన రైతులకు అక్కడ కూడా నిరాశ ఎదురైంది. సరుగుడుకు కూడా ధరలు లేకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితుల్లో మునిగిపోయారు.

రీ సర్వేలో తప్పిదాలు.. ఆందోళనలో అన్నదాతలు

ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో భారీగా తప్పిదాలు, అవకతవకలు చోటు చేసుకోవడం అన్నదాతలను కుంగదీసింది. చాలా మండలాల్లో ఒకరి భూమిని మరొకరి ఖాతాలో వేసి రెవెన్యూ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. దీంతో గ్రామాల్లో భారీగా రీ సర్వే వివాదాలు పెరిగాయి. అవి ఇప్పటికీ పరిష్కారం కాలేదు. చాలా మంది రైతులు తమ భూమిని ఆన్‌లైన్ లోపాలు సరి చేసుకునేందుకు భారీగా అప్పులు చేసి మరీ రెవెన్యూ సిబ్బందికి ముడుపులు ఇచ్చుకోవలసి రావడంతో వారు రగిలిపోతున్నారు. ఇదే సమయంలో పట్టాదారు పాసు పుస్తకాలపై సీఎం జగన్ ఫొటోలు ముద్రించడంతో ఇవి ప్రభుత్వానికి దఖలు పడిపోతాయేమోనన్న ఆందోళన అన్నదాతలను పట్టిపీడిస్తున్నది. ఇక వ్యవసాయానికి నిరాటంకంగా నాణ్యమైన విద్యుత్ తొమ్మిది గంటల పాటు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఎక్కడా అమలుకాని పరిస్థితి ఉంది. నిరంతరం అంతరాయాలతో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా తొమ్మిది గంటల నుంచి 5 గంటలకు, అక్కడ నుంచి రెండు లేదా మూడుగంటలకు పరిమితమైపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అరకొర విద్యుత్ సరఫరా వల్ల కనీసం ఎకరం కూడా నీరు తడవని పరిస్థితి ఉండడంతో అన్నదాతలు రగిలిపోతున్నారు.

ఉద్యాన పంటలకు దక్కని సాయం

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యాన పంటలకు దాదాపుగా ప్రోత్సాహం కరువైంది. టీడీపీ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో దాదాపుగా 13 రకాల పథకాల కింద రైతులకు పండ్ల తోటల పెంపకం, పామాయిల్, అరటి, జామ వంటి తోటలతో పాటు కూరగాయల పెంపకాలకు సాయం అందేది. ప్రతి రైతుకు కనీసం ఐదు ఎకరాలకు తక్కువ లేకుండా ఈ పథకాలకు రాయితీపై విత్తనాలు, ఉచితంగా ఎరువులు అందజేసేవారు. ఈ పథకాలకు అవసరమైన డ్రిప్ పరికరాలు కూడా ప్రభుత్వం 90శాతం రాయితీపై అందించేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అంతర పంటలు, కూరగాయల సాగు, ఉద్యాన పంటల రైతులకు రాయితీలు ఆగిపోయాయి. వారికి అందించే ఎరువుల సరఫరా కూడా నిలిచిపోయింది.

డ్రిప్ సౌకర్యానికి కూడా ఇబ్బందులే

గత నాలుగేళ్లలో డ్రిప్ కంపెనీలకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో రైతులకు డ్రిప్ సౌకర్యం కూడా అందుబాటులో లేకుండా పోయింది. ఉమ్మడి జిల్లాలో డ్రిప్ కంపెనీలకు దాదాపుగా రూ.400 కోట్లకు పైగా బిల్లులు చెల్లించకపోవడంతో కంపెనీలు రైతులకు డ్రిప్ సౌకర్యం కల్పించకుండా నిలిపివేశాయి. డ్రిప్ కోసం దరఖాస్తు చేసిన రైతులకు కంపెనీల నుంచి స్పందన లేకపోవడంతో చాలామంది రైతులు తమ సొంత ఖర్చులతో డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని రైతులు పంటలు వేయడం మానుకున్నారు.

వ్యవసాయ పరికరాలు, యంత్రాల సరఫరా నిల్

గతంలో వ్యవసాయానికి అవసరమైన ట్రాక్టర్‌లు, మినీ టిల్లర్‌లు, దుక్కిదున్నే నాగలి సెట్‌లు, ఆయిల్ ఇంజిన్లు, మడత పైపులు, టార్పాలిన్లు, కూరగాయల పెంపకానికి ఉపయోగపడే క్రేట్‌లు, మినీ వ్యాన్లు, ఇతర వ్యవసాయ పరికరాలు రైతులకు సబ్సిడీపై అందజేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీకి కేవలం ఒకరిద్దరికి వ్యవసాయ పరికరాలు ఇచ్చి అదే అందరూ ఉపయోగించుకోవాలంటూ షరతులు పెట్టడంతో రైతులకు నిరాశే మిగిలింది.

జలకళ లేదు

జిల్లాలో ప్రతి రైతుకు వ్యవసాయ బోరుతో పాటు మోటారు, విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇస్తామంటూ వై ఎస్సార్ జలకళతో హడావిడి చేసిన ప్రభుత్వం కేవలం నామమాత్రంగా జిల్లా అంతటా కేవలం 400 బోర్లు తవ్వి ఊరుకుంది. ఈ రైతులకు ఇవ్వవలసిన వ్యవసాయ మోటార్లు కూడా దక్కలేదు. వీటిలో విద్యుత్ సౌకర్యం కూడా రైతులకు రాలేదు. దీంతో ఈ పథకం పూర్తిగా విఫలమైంది. అలాగే జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న పంటలకు రావలసిన ఇన్‌పుట్ సబ్సిడీ ఇంత వరకూ విడుదల కాకపోవడంతో అన్నదాతలు ఆగ్రహంతో ఉన్నారు.

రైతు భరోసా కేంద్రాల సేవలు అంతంత మాత్రమే..

ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే రైతు భరోసా కేంద్రాల సేవలు కూడా రైతులకు అక్కరకు రాని విధంగా ఉన్నాయి. రైతులు ఆ కేంద్రాలపై ఆశలు వదులుకున్నారు. విత్తనాల పంపిణీ సమయంలో తప్పితే ఈ కేంద్రాల వద్ద ఒరిగేదేమీ లేకపోవడంతో అన్నదాతలు రైతు భరోసా కేంద్రాలపై భరోసా కోల్పోయారు.

సాగునీటి వనరులపై అంతులేని నిర్లక్ష్యం

జిల్లాలో వ్యవసాయం ప్రధాన వ్యాపకం అయినప్పటికీ, ఈ ప్రాంతంలోని సాగునీటి వనరులను వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో వ్యవసాయానికి సాగునీరు అందక వేలాది ఎకరాలు నిరుపయోగంగా ఉండిపోయాయి. రైవాడ, పెద్దేరు, కోనాం, తాండవ, కల్యాణపులోవ వంటి రిజర్వాయర్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో పాటు బడ్జెట్‌లో నిధులను కూడా కేటాయించలేదు. దీంతో ఈ రిజర్వాయర్ల పరిధిలో ఆయకట్టుకు పూర్తిగా సాగునీరు అందని దుస్థితి. కాలువలు సరిగా లేక సాగునీరు భూములకు అందని దయనీయ పరిస్థితి నెలకొంది. జిల్లాలోని శారదా, పెద్దేరు, బొడ్డేరు నదులపై ఉన్న గ్రోయిన్లను, చెరువులను కూడా ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఫలితంగా వ్యవసాయం పూర్తిగా వర్షాధారంగానే మారిపోయి దైవాధీనంగా అన్నదాతల పరిస్థితి తయారైంది. మొత్తం మీద వ్యవసాయపరంగా అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కక, ప్రభుత్వ ప్రోత్సాహం లభించక గడచిన ఐదేళ్లుగా నైరాశ్యంలో మునిగిపోవడంతో జిల్లాలో వ్యవసాయం కళతప్పింది.

నేటితో ఎన్నికల ప్రచారానికి తెర

- సాయంత్రం 6 గంటలతో సరి
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రచార గడువు శనివారం సాయంత్రం 6 గంటలతో ముగియనుంది. ఈ నెల 13న జరగబోయే పోలింగ్ ప్రక్రియ నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరిగేందుకు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన పోలింగ్‌కు 48 గంటల ముందు సైలెన్స్ పీరియడ్ అమలులోకి రానుంది. ఈ నెల 14వ తేదీ వరకు సైలెన్స్ పీరియడ్ కొనసాగనుంది. ఇందులో భాగంగా అభ్యర్థులు ప్రచారంతో పాటు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రసారాలు నిలిపి వేయాల్సి ఉంటుంది. బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా జరిపే ఎన్నికల ప్రచారాలకు అనుమతి ఉండదు. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారాలపై ఎన్నికల కమిషన్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టనున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో సీఆర్‌పీసీ 144 సెక్షన్ ప్రకారం ఒకచోట ఐదుగురు గుమిగూడి ఉండకూడదు. పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల వ్యవధిలో లౌడ్ స్పీకర్లు వినియోగించకూడదు. అంతే కాకుండా నియోజకవర్గానికి కొత్త వ్యక్తులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు కానివారు, రాజకీయ పార్టీల కార్యకర్తలు స్వగ్రామాలకు వెళ్లిపోవాల్సి ఉంటుంది.

ఓట్ల కోసం ప్రలోభాల వల

- ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్న వైసీపీ
- కొరవడిన అధికారుల నిఘా

అనకాపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల తేదీ సమీపించడంతో ఓటర్లకు నగదు పంపిణీని వైసీపీ నాయకులు మొదలెట్టారు. గ్రామాల్లో సామాజిక వర్గాల నేతలు, డ్వాక్రా సంఘాల మహిళలు, యువజన సంఘాల నాయకుల ద్వారా డబ్బును ఆయా వర్గాలకు చేరేలా ఏర్పాట్లు చేశారు. అనకాపల్లి నియోజకవర్గంలో వైసీపీ నాయకులు ఓటుకు రూ.1500 చొప్పున ఇస్తున్నట్టు

... మిగతా 8వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

వీరవల్లి అగ్రహారంలో విషాద ఛాయలు



విస్సారపు గణేశ్ (ఫైల్)



శీలం మధు (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, మే 10:

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వీరిద్దరూ స్నేహితులు. పని మీద బైక్‌పై చోడవరం వెళుతూ శుక్రవారం ప్రమాదానికి గురయ్యారు. దీనికి సంబంధించి మృతుల బంధువులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.

మాడుగుల మండలం వీరవల్లి అగ్రహారం గ్రామానికి చెందిన విస్సారపు గణేశ్(30), శీలం మధు(30) చిన్ననాటి స్నేహితులు. విస్సారపు గణేశ్ వడ్డాదిలో దాబా హోటల్ నిర్వహిస్తుండగా, శీలం మధు వడ్డాదిలో బైక్ మెకానిక్‌గా షెడ్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం గణేశ్ చోడవరంలో పని ఉందని మెకానిక్ షెడ్ దగ్గరకి వచ్చి మధుని పిలవడంతో బైక్‌పై ఇద్దరూ బీఎన్ రోడ్డులో వడ్డాది నుంచి చోడవరం బయలుదేరారు. విజయరామరాజుపేట రెవెన్యూ పరిధిలో గాయత్రి డిగ్రీ కళాశాల హాస్టల్ సమీపాన ఎదురుగా చోడవరం వైపు నుంచి వడ్డాది వైపు వస్తున్న వ్యాన్ వీరి బైక్‌ను బలంగా ఢీకొంది. బైక్ పైనుంచి వ్యాన్ వెళ్లడంతో గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మధుకు తీవ్ర గాయాలు కావడంతో చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందించేలోగా మృతి చెందాడు. ప్రమాదానికి కారకుడైన వ్యాన్ డ్రైవర్ పరారయ్యాడు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు గణేశ్‌కు మూడేళ్ల క్రితమే వివాహమైంది. వీరికి ఏడాది బాబు ఉండగా, ప్రస్తుతం భార్య శ్యామల గర్భిణి. కాగా మధుకు ఐదేళ్ల క్రితం ప్రసన్నతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. మృతుల స్వగ్రామం వీరవల్లి అగ్రహారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారు మృతి చెందిన విషయం తెలిసి కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు.

బీఎన్ రోడ్డుపై గ్రామస్థుల ఆందోళన

వ్యాన్ ఢీకొని గణేశ్, మధు మృతి చెందడంతో వీరవల్లి అగ్రహారం గ్రామస్థులు బీఎన్ రోడ్డుపై ఆందోళన చేశారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు బీఎన్ రోడ్డు నుంచి గౌరపట్నం, వడ్డాది గ్రామం మీదుగా బీఎన్ రోడ్డుకి ట్రాఫిక్ మళ్లించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మత్స్యకారులు దుర్మరణం



సోమునాయుడు, నూకరాజు మృతదేహాలు

అచ్యుతాపురం, మే 10: విద్యుదాఘాతంలో ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారని సీఐ బుచ్చిరాజు తెలిపారు. దీనికి సంబంధించి సీఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పూడిమడక శివారు కడపాలేనికి చెందిన యజ్జల సోమునాయుడు(25), చోడిపల్లి నూకరాజు(28) గురువారం రాత్రి చేపల వేటకు వలతో ఉప్పుటేరులో దిగారు. పక్కనే రొయ్యల చెరువులున్నాయి. వీరిద్దరూ ఉప్పుటేరులోంచి రొయ్యల చెరువు గట్టు ఎక్కడానికి ప్రయత్నించి రొయ్యల చెరువు గట్టుపై ఉన్న కంచెను

... మిగతా 6వ పేజీలో



నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడును శాలువాతో సత్కరిస్తున్న ముస్లిం మత పెద్దలు

ఈ మూడు రోజులే కీలకం

- ఏమాత్రం ఏమరుపాటు వద్దు
- పోలింగ్ పూర్తయ్యేంత వరకూ అప్రమత్తంగా ఉండండి
- అన్ని వర్గాల వారు పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా చూసుకోండి
- కూటమి అభ్యర్థులకు టీడీపీ అధినేత చంద్రబాబు సూచన

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల ప్రక్రియ చివరి దశకు వచ్చిందని, పోలింగ్‌కు మరో మూడు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కూటమి అభ్యర్థులకు తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు సూచించారు. నగరంలో ప్రచారానికి విచ్చేసిన ఆయన గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయంలో విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో గల అభ్యర్థులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. శనివారం సాయంత్రంతో ప్రచారం ముగియనున్నదని, తరువాత పోలింగ్ ముగిసేంత వరకూ ప్రతి నిమిషం ఎంతో కీలకమని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఏమరుపాటుతో ఉండొద్దని హెచ్చరించారు. ప్రత్యర్థి వైసీపీ కుట్రలు, కుతంత్రాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నియోజక వర్గాల్లో పార్టీ నాయకులను సమన్వయం చేసుకోవాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే వెంటనే సరిచేసుకోవాలని, ప్రతి ఒక్కరి సహాయం అవసరమని గుర్తించాలన్నారు. నగరంలో అన్నివర్గాల వారు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసేలా చూసుకోవాలన్నారు. నగరంలో ఓటింగ్ శాతం భారీగా పెరిగితే కూటమికి మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ వైసీపీ అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లామని, నగరంలో కూటమికి అనుకూల వాతావరణం ఉందని వివరించారు. సమీక్షలో విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థులు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, గణబాబు, పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ పాల్గొన్నారు.

జగన్ దోచుకున్న సొమ్ము ఖజానాకు జమ చేస్తాం

- రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలి
- నర్సీపట్నం రోడ్డు షోలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్
- అధికారంలోకి వచ్చిన వెంటనే భూ హక్కు చట్టం రద్దు: అయ్యన్న



రోడ్డు షోలో అభివాదం చేస్తున్న అయ్యన్న, సీఎం రమేశ్



కార్యక్రమానికి తరలివచ్చిన నాయకులు, కార్యర్తలు, ప్రజలు

నర్సీపట్నం, మే 10 : కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌రెడ్డి లండన్‌లో దాక్కున్నా.. మరెక్కడ దాక్కున్నా.. పట్టుకొని తీసుకొచ్చి ఆయన దోచుకొని, దాచుకున్న సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ స్పష్టం చేశారు. మాజీ మంత్రి, నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఇక్కడ భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఎం రమేష్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్ ఒక్క చాన్స్ అని అడిగితే ప్రజలు గెలిపించినందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడతారా.. అని ప్రశ్నించారు. ఇసుక మాఫియా, లిక్కర్ మాఫీయాతో రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే భూ హక్కు చట్టం-2023ను రద్దు చేస్తామన్నారు. ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకొని జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆస్తులు దోచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రూ.ఏడు లక్షలతో తాండవ గేట్లు మరమ్మతులు చేయించలేని చేతకాని ఎమ్మెల్యే అని ఎద్దేవా చేశారు. మునిసిపాలిటీలో ఆస్తి పన్ను పెంచారని, ట్యాంక్ బండ్ పనులు ఆపేశారని విమర్శించారు. ఏరియా ఆస్పత్రిలో డాక్టర్లు లేరని, మందులు లేవని అన్నారు. ఈ ఎన్నికల్లో తనతో పాటు సీఎం రమేశ్‌ని ఎంపీగా గెలిపించుకుంటే పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. తెలంగాణ రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి నర్సిరెడ్డి మాట్లాడుతూ జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో లూటీ తప్ప అభివృద్ధి లేదని ఎద్దేవా చేశారు. జనసేన నాయకుడు, సినీ నటుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో నర్సీపట్నంలో అభివృద్ధి జరగ లేదని, ఎమ్మెల్యే ఇంట్లో అభివృద్ధి జరిగిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ తదితరులతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పట్టణ వాసులు పాల్గొన్నారు.





ఆలయం వద్ద పుష్పాలతో అలంకరించిన అప్పన్నస్వామి... స్వామివారి దర్శనానికి క్యూల్లో బారులు తీరిన భక్తులు

సింహగిరికి పోటెత్తిన భక్తులు

- వేలాదిగా తరలివచ్చిన జనంతో కిక్కిరిసిన క్యూలు
- త్వరితగతిన నిజరూప దర్శనం కావడంతో హర్షం
- ఘనంగా చందనోత్తరణం, సహస్రఘటాభిషేకాలు

సింహాచలం, మే 10: వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవానికి భక్తులు పోటెత్తారు. గురువారం అర్ధరాత్రి నుంచే క్యూ లైన్లలో బారులు తీరారు. ఈ ఏడాది ముందుగానే దర్శనానికి అవకాశం కల్పించడంతో భక్తులందరికీ స్వామి దర్శన భాగ్యం కలిగింది. ఉచిత క్యూలోని భక్తులకు సుమారు 3.5 గంటల్లో, రూ.1500 క్యూలో భక్తులకు 30 నిమిషాల్లో స్వామివారి దర్శనం పూర్తయింది. ఈ ఏడాది ఎన్నికల సందర్భంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా అధికారులు పకడ్బందీగా వ్యవహరించారనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపించాయి.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

స్వామివారి నిజరూపాన్ని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్.సత్యనారాయణ, శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, కలెకర్ మల్లికార్జున, జీవీ ఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, సీపీ రవిశంకర్ అయ్యనార్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, జాయింట్ కలెక్టర్ అశోక్, జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, నగర పోలీసు జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, డీఐజీ విశాల్ గున్నీ, హైకోర్టు న్యాయమూర్తులు సుబ్బారెడ్డి సత్తి, ఏవీ రవీంద్రబాబు, వి.శ్రీనివాస్, కిరణ్మయి మండవ, జిల్లా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ స్వామిని దర్శించుకున్నారు.

ఏర్పాట్లు బాగున్నాయి

స్వామివారి నిజరూప దర్శనాన్ని భక్తులందరికీ కల్పించడంలో అధికారులు సఫలీకృతులయ్యారని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. సింహాద్రినాథుని నిజరూపాన్ని ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్రతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది చందనోత్సవంలో అప్పటి మంత్రి, పోలీసుల కారణంగా సమస్యలు తలెత్తాయని, అధికారులు ఈసారి ముందు జాగ్రత్తలు తీసుకుని నిజరూప దర్శనం ఏర్పాట్లలో సఫలీకృతులయ్యారన్నారు.

ప్రణాళికతో విజయవంతం : కలెక్టర్

ముందస్తు ప్రణాళికతో చందనోత్సవం విజయవంతమైందని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. సామాన్య భక్తులకు తెల్లవారుజామున నాలుగు గంటలకు ముందే దర్శనం కల్పించామన్నారు. దర్శనం టికెట్ల రీసేల్‌ను నివారించేందుకు స్కానింగ్, పంచింగ్ వంటి చర్యలు ఫలితానిచ్చాయని చెప్పారు.

కన్నుల పండువగా అప్పన్న నిజరూప దర్శనం

- భారీగా తరలివచ్చిన భక్తులు



స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 10: స్థానిక గవరపాలెం దిబ్బవీధిలోని వరహా లక్ష్మీనరసింహ స్వామి నిజరూప దర్శనం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి చందనోత్సవంలో భాగంగా వేకువజామున రెండున్నర గంటలకు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో అప్పన్నస్వామికి మేలుకొలుపు నిర్వహించారు. అనంతరం చందనం ఒలిచి స్వామివారి నిజరూపానికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రత్నాకర్‌ను ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

తెల్లవారుజాము నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారి నిజరూపాన్ని దర్శించుకున్నారు. సాయంత్రం ఐదు గంటలకు స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సహస్ర కలశాభిషేకం నిర్వహించి స్వామివారికి తొలివిడతగా చందనం పూత కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం కూడా భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి నిజరూప దర్శనం అనంతరం జరిగిన కార్యక్రమాలను తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు.

వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో గుణపాఠం చెప్పాలి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పిలుపు



బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను సత్కరిస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

పరవాడ, మే 10: ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో గుణపాఠం చెప్పాలని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సంతబయలు వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీని మూడోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రంతో మంచి సంబంధాలు కలిగిన వ్యక్తిగా తాను పరవాడ ప్రాంతానికి పరిశ్రమలు, నీటి ప్రాజెక్టులు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటు వేసి తనను, గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి పంచకర్ల రమేశ్‌బాబును గెలిపించాలని కోరారు. జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ పరవాడ ప్రాంత నిరుద్యోగ యువతకు ఫార్మాసిటీ, ఎన్టీపీసీలో ఉపాధి కల్పించడానికి కృషి చేస్తానన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం సీఎం రమేశ్‌ను టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు ఘనంగా సత్కరించాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మాసవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాథరావు, మాదంశెట్టి నీలబాబు, శిరపురపు అప్పలనాయుడు, కన్నూరి వెంకటరమణ, వియ్యపు చిన్న, పైలా సన్యాసిరావు మాస్టారు, మోటూరి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర మోహన్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు పటిష్ఠ చర్యలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, మే 10: జిల్లాలో జరిగే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు దల్జీత్‌సింగ్‌మంగత్, ఎస్పీ కేవీ మురళీకృష్ణలతో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి డీఎస్పీ స్థాయి పోలీసు అధికారుల్ని నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కడా తీవ్రస్థాయి గొడవలు తలెత్తే అవకాశం లేదని, పోలీస్ అధికారులు భద్రతా దళాలతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఎటువంటి పొరపాటుకు అవకాశం లేకుండా వ్యవహరించాలన్నారు. పోలింగ్ సిబ్బందిని కేంద్రాలకు తీసుకువెళ్లేటప్పుడు వాహనాన్ని మధ్యలో ఎట్టి పరిస్థితుల్లో ఆపరాదన్నారు. పోలింగ్ సమయంలో మొదటి మూడు గంటలు, ఆఖరు రెండు గంటలు కీలకమైనవని, ఆ సమయంలో సమర్థవంతంగా పనిచేయాలన్నారు. 11వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు జరగకుండా చూడాలన్నారు. ఎన్నికల పరిశీలకులు దల్జీత్‌సింగ్‌మంగత్ మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అందరూ కృషి చేయాలన్నారు. ఆఖరి రెండు రోజుల్లో వివిధ స్థాయిల్లో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే అవకాశం ఉన్నందున సూక్ష్మస్థాయిలో తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరగాలి

- పార్టీలకతీతంగా పనిచేయండి
- జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, మే 10: జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎన్నికలు జరిగేలా అధికారులు దృష్టి కేంద్రీకరించాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన కేంద్ర పోలీస్ బలగాల అధికారులు, డీఎస్పీలు, ఇతర అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్ గురించి వివరించారు. పోలింగ్‌కు 72 గంటల ముందు పోలీసులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే ధ్యేయంగా అధికారులంతా పనిచేయాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువుల కట్టడి, వాహనాల తనిఖీ, సెర్చ్ అండ్ సీజర్లు, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ స్టేషన్‌కు చేరుకునే వరకు, ఓటింగ్ ముగిసిన తరువాత పోలైన ఈవీఎంలను రిసెప్షన్ సెంటర్లకు చేరే వరకు కేంద్ర పోలీస్ బలగాల ఎస్కాట్ పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహించకుండా పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ఓటర్ల మినహా ఇంకా ఎవరూ ఉండకుండా చూడాలన్నారు. 200 మీటర్ల దూరంలో ఓటర్ల వాహనాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అనకాపల్లి టౌన్, మే 10: జాతీయ రహదారిలోని కొత్తూరు జంక్షన్‌కు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. 55 నుంచి 60 ఏళ్ల వయసు గల వ్యక్తి కొత్తూరులోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ సమీపంలో రోడ్డుపై నడుచుకుని వెళుతుండగా విశాఖ నుంచి ఎలమంచిలి వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొని పరారైందన్నారు. మృతుడు లుంగీ ధరించి ఎరుపు గీతల చొక్కా ధరించి ఉన్నాడని, మరే ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందివ్వాలని ఎస్‌ఐ కోరారు.

ఉపాధి పనుల్లో కూలీకి పాముకాటు

- విశాఖ కేజీహెచ్‌లో చికిత్సలు

గొలుగొండ, మే 10: ఉపాధి పనుల్లో ఉన్న ఓ కూలీ పాము కాటుకు గురయ్యాడు. ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో చికిత్సలు పొందుతున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్‌లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. రోజూలాగే పాకలపాడు గ్రామానికి చెందిన రొంగల రాజబాబు శుక్రవారం పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా ఒక్కసారిగా పాము కాటు వేసింది. ఇది చూసిన తోటి కూలీలు వెంటనే అతనిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకు రాగా.. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఏపీవో చిటికెల రాధిక బాధితుడ్ని పరామర్శించారు.

షాపుల్లో మద్యం నిల్.. గ్రామాల్లో ఫుల్

- ఖాళీ అవుతున్న మందుబాబుల జేబులు



మండల కేంద్రంలోని మద్యం షాపు మూసేసిన దృశ్యం

సబ్బవరం, మే 10: మండలంలో నెల రోజులుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మందు బాబులకు మద్యం దొరకడంలో లేదు. మండల పరిధిలో ఆరిపాక, వంగలి, గుల్లేపల్లి, అసకపల్లి, అమృతపురం, మండల కేంద్రంలో మూడు మద్యం దుకాణాలున్నాయి. నెల రోజులు నుంచి మద్యానికి పూర్తిగా కొరత ఏర్పడింది. రెండు, మూడు గంటలు పాటు మద్యం అమ్మడం తరువాత షాపులు మూసేయడం జరుగుతోంది. అదేమని మందు బాబులు అడిగితే సింపుల్‌గా స్కానర్ పనిచేయడం లేదని చెప్పేస్తున్నారు. మందు లేనిదే రోజు గడవని కొందరు ముందుగానే మేల్కొని షాపు తెరిచిన వెంటనే తీసేసుకుంటున్నారు. రోజూ మద్యం అవసరమైన వారు బెల్టుషాపులను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. అక్కడ 130 క్వార్టర్(చీప్) బాటిల్ రూ.200, రూ 220 ఉండే(ఎంహెచ్ ఇతరత్రా) రూ.300కు కొనుగోలు చేసుకొని మందుబాబులు తాగుతున్నారు. ఇటీవల ఒక మద్యం షాపులో పని చేసే కుర్రాళ్లకు, మందుబాబులకు మధ్య గొడవ కూడా జరిగిందట. మద్యం అమ్మకుంటే షాపు ఎందుకు? మూసేయండిని ప్రశ్నించారట.. దీంతో షాపులో కుర్రాళ్లు దురుసుగా సమాధానం చెప్పడంతో మందుబాబులు చేతికి పనిచెప్పినట్టు తెలిసింది. దీంతో అప్పటి నుంచి స్కానర్ పని చేయకపోతే.. షాపు మూసేస్తున్నారు. మద్యం షాపులు నుంచే బెల్ట్‌షాపులకు కమిషన్ తీసుకొని కొంత మంది తరలిస్తున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో సెబ్/పోలీసు అధికారులు గ్రామాల్లో అడపా దడపా దాడులు చేసి అక్రమ మద్యం పట్టుకుంటున్నారు. అయితే చాలా గ్రామాల్లో ఇళ్లలో కూడా మద్యం అమ్ముతుండడంతో పట్టుబడడం లేదని అధికారులు చెబుతున్నారు. ఏదైనా మందుబాబులకు జేబులు మాత్రం లూటీ అవుతున్నాయి. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఎస్ఈబీ అధికారులు అందుబాటులో లేరు.

జగన్‌కు పాలించే హక్కులేదు

- తూర్పు కాపుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రమణయ్య

నక్కపల్లి, మే 10: ఐదేళ్ల నియంత పాలన చేసిన సీఎం జగన్‌కు పాలించే హక్కు లేదని, తమకు జీవో వున్నా చదువుకుంటున్న పిల్లలకు తూర్పుకాపు సర్టిఫికెట్లను ఈ ప్రభుత్వం ఇవ్వలేదని ఉమ్మడి విశాఖ జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏపీ రమణయ్య అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి పూర్తిగా మందగించిందన్నారు. పారిశ్రామిక రంగంలో ఏపీ బాగా వెనుకబడిపోవడం వల్ల తలసరి ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకపోవడం శాపంగా మారిందన్నారు. ఆయన వెంట తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు కర్రి బాబ్జీ, ఎం.సన్యాసిరావు, కె.సన్యాసిరావు, పేకేటి రాజారావు, నెల్లూరి చిన్న, కోసూరు కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా వేసవి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, మే 10: వేసవి ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దువ్వాడ మీదుగా పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు.

కాచీగూడ-బ్రహ్మపూర్-కాచీగూడ

07135 నంబరు గల రైలు ఈనెల 11న (శనివారం) రాత్రి 10.55 గంటలకు కాచీగూడలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.00 గంటలకు దువ్వాడ, సాయంత్రం 5.00 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరిగి ఈనెల 12న (ఆదివారం) రాత్రి 10.35 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 3.20 గంటలకు దువ్వాడ, సాయంత్రం 4.00 గంటలకు కాచీగూడ చేరుతుంది.

చెన్నై ఎగ్మోర్-భువనేశ్వర్-చెన్నై ఎగ్మోర్

06107 నంబరు గల రైలు ఈనెల 11, జూన్ ఒకటన (ప్రతి శనివారం) ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయలుదేరి రాత్రి 10.05 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 6.30 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. తిరిగి ఈ నెల 12, జూన్ 2న (ప్రతి ఆదివారం) ఉదయం 9.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ, మర్నాడు (సోమవారం) ఉదయం 8.30 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది.

కేఎస్‌ఆర్ బెంగళూరు-భువనేశ్వర్-కేఎస్‌ఆర్ బెంగళూరు

06247 నంబరు గల రైలు ఈనెల 11న (శనివారం) ఉదయం 5.15 గంటలకు కేఎస్ఆర్ బెంగళూరులో బయలుదేరి రాత్రి 11.13 గంటలకు దువ్వాడ, మర్నాడు (ఆదివారం) ఉదయం 8.30 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. తిరిగి ఈనెల 12న (ఆదివారం) ఉదయం 9.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి సాయంత్రం 5.08 గంటలకు దువ్వాడ, మర్నాడు (సోమవారం) మధ్యాహ్నం 12.45 గంటలకు కేఎస్ఆర్ బెంగళూరు చేరుతుంది.

చెన్నై ఎగ్మోర్-సంబల్‌పూర్-చెన్నై ఎగ్మోర్

06109 నంబరు గల రైలు ఈనెల 18, జూన్ 7న (ప్రతి శనివారం) ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయలుదేరి రాత్రి 10.05 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 9.00 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది. తిరిగి ఈనెల 19, జూన్ 8న (ప్రతి ఆదివారం) ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, మర్నాడు (సోమవారం) ఉదయం 10.35 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	133.00
లైవ్ ధర	153.00
విత్ స్కిన్	276.00
స్కిన్ లెస్	286.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

కూటమికే మొగ్గు

ధరల పెరుగుదల, విద్యుత్, ఆర్టీసీ చార్జీల పెంపుతో వైసీపీ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత



సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మరో 48 గంటల్లో పోలింగ్ ప్రారంభం కానున్నది. గత, ప్రస్తుత ప్రభుత్వాల పనితీరు, మేనిఫెస్టోలు, నేతల మాటలు, హామీలు శ్రద్ధగా గమనిస్తూ వచ్చిన ఓటర్లు ఇప్పటికే ఎవరికి ఓటు వేయాలో ఒక నిర్ణయానికి వచ్చేశారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నాడిని తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' బృందం ప్రయత్నం చేసింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని వివిధ వర్గాలు, వయసుల వారిని పలకరించింది. అత్యధికులు తెలుగుదేశం, జనసేన, బీజేపీలతో కూడిన కూటమి వైపు మొగ్గు చూపుతున్నట్టు ఈ సందర్భంగా స్పష్టమైంది. నిత్యావసర ధరల పెరుగుదల, ఆర్టీసీ, విద్యుత్ చార్జీల పెంపు, రహదారుల సమస్య, నిరుద్యోగ సమస్య, పంటలకు గిట్టుబాటు ధరలు దక్కకపోవడం పలువురు ప్రస్తావించారు. అప్పులు చేసి పంచుతామనే విధానం సరికాదని, సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి కూడా ముఖ్యమని చాలామంది అభిప్రాయపడ్డారు. మరికొంతమంది కూటమి మేనిఫెస్టో తమను ఆకట్టుకుందని పేర్కొన్నారు. అతికొద్దిమంది మాత్రం వైసీపీ ప్రభుత్వ పనితీరు ఫర్వాలేదని, పథకాలతో తాము లబ్ధి పొందినట్టు చెప్పారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఓటేస్తాం



యువతకు ఉపాధి అవకాశాలు ఉండాలి. అలాగే రాష్ట్రం కూడా అభివృద్ధి చెందాలి. ఇవన్నీ ఆలోచించే ఓటు వేస్తాం. అలాగే పోటీ చేసే వ్యక్తి కూడా ఎలాంటి వారన్నది ఆలోచిస్తాం. సామాన్యులు బతకాలంటే నిత్యావసర ధరలు అందుబాటులో ఉండాలి. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయి. ఓటుకు డబ్బులిచ్చినంత మాత్రాన ఓటేసే పరిస్థితి లేదు. ఆలోచించే ఏది మంచిది అనుకుంటే అటువైపే ఉంటాం. ఎప్పుడూ ఒక పార్టీకే ఓటేసే పరిస్థితి లేదు. ప్రభుత్వ పనితీరు బట్టి ఎన్నికల్లో ఓటు ఎటు వేయాలో నిర్ణయించుకుంటాం.

- పోతిరెండి ఈశ్వరరావు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి, ఎంవీపీ కాలనీ

పంచడమే కాదు, సంపద పెంచడమూ తెలిసుండాలి



స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మారిపోయింది. ఇది చాలా దారుణం. అన్ని వస్తువుల ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి. సంక్షేమ పథకాలు ఇవ్వడమే కానీ, రాష్ట్ర ఆర్థిక వనరులను ఎలా పెంపొందించుకోవాలో అనే సూత్రాన్ని ప్రస్తుత సర్కారు విస్మరించింది. చంద్రబాబు పాలనలో అయితే సంక్షేమ పథకాలు ఎన్ని ఉన్నా, సంపద సృష్టించడం తెలిసిన పరిపాలనాదక్షుడు చంద్రబాబు. దేశంలోనే మేధావిగా గుర్తింపు పొందిన చంద్రబాబును నోటికొచ్చినట్టు మాట్లాడ్డం ప్రజలను బాధించింది.

- తంగెళ్ల శ్రీనివాస్, వస్త్ర వ్యాపారి, సీహెచ్‌ఎల్‌పురం, నక్కపల్లి మండలం

చంద్రబాబుకే...



టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు బాగున్నాయి. ముఖ్యంగా మహిళలకు, రైతులకు, వృద్ధులకు, దివ్యాంగులకు పెద్దపీట వేశారు. దీంతో చంద్రబాబుకు ఓటు వేయాలని అనుకుంటున్నాను. జగన్ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు, ఎరువుల ధరలు పెరిగిపోయాయి. పంటలకు గిట్టుబాటు ధర లేదు. అందుకే చంద్రబాబుకు ఓటు వేయాలని మా కుటుంబ సభ్యులు అనుకుంటున్నాం.

- బోను ముత్యాలనాయుడు, మంచాల, చీడికాడ మండలం

బాబు వస్తే జాబు



చంద్రబాబు అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని విశ్వసిస్తున్నా. వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయం మినహా ఇతర శాఖల్లో ఖాళీగానున్న పోస్టులు భర్తీ చేయలేదు. బ్యాక్‌లాగ్ పోస్టుల ప్రస్తావన లేదు. నవరత్నాలు అంటూ అభివృద్ధిని పట్టించుకోలేదు. జీవో నంబరు-3 పునరుద్ధరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ జీవో ఆదివాసీలకు చాలా విలువైంది. కూటమి అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. కూటమి పథకాల మేనిఫెస్టో బాగుంది. కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని నిర్ణయం తీసుకున్నాను.

- దేవరాజు బాలక్రిష్ణ, దేవరాపల్లి

బాబు వస్తే చిరు వ్యాపారుల బతుకులు బాగుంటాయి



చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే మాలాంటి చిరు వ్యాపారులకు సబ్సిడీ రుణాలు అందుతాయన్న నమ్మకంతో పాటు, వ్యాపారాలు కూడా బాగుపడతాయన్న ఆశతో ఈసారి ఆయనకు ఓటు వేయాలనుకుంటున్నాం. గతంలో టీడీపీ పాలనలో మాకు సబ్సిడీ రుణాలు అవీ బాగానే వచ్చేవి. ఈ ఐదేళ్లలో రుణాలు ఏవీ లేవు. వ్యాపారాలు కూడా బాగా దెబ్బతిన్నాయి. చంద్రబాబు అధికారంలోకి వస్తే మళ్లీ మా పరిస్థితి బాగుపడుతుందని, మా పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్న నమ్మకం కూడా కలుగుతుంది. నిత్యావసరాల ధరలు కూడా తగ్గుతాయని భావిస్తున్నాం. చోడవరంలో సైతం అభివృద్ధి జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి.

- అబోతు శ్రీనివాసరావు, పండ్ల వర్తకుడు, చోడవరం

బతకడం కష్టంగా ఉంది



డిగ్రీ చదువుకున్నాను. మా కుటుంబ పరిస్థితుల వల్ల కొరియర్ సంస్థలో పనిచేస్తున్నాను. ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్లు లేవు. నిరుద్యోగం పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదు. అప్పులు మీద అప్పులు చేసి వారు అనుకున్న విధానంలో పంచిపెడుతోంది. మాలాంటివాళ్లం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. నిత్యావసర సరకుల ధరలు అదుపులేకుండా పెరిగిపోతున్నాయి. బతకడం కష్టంగా మారుతుంది. దీనిని బట్టి నేను ఓటు ఎవరికి వేస్తానో మీకు అర్థమయ్యే ఉంటుంది.

- ఆదిత్య, ప్రైవేటు ఉద్యోగి, భీమిలి

ప్రభుత్వం మారితే మరింత లబ్ధి



ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న పథకాలు బాగున్నాయి కానీ అంతకు మించి రైతులకు లబ్ధి చేకూరుస్తామని కూటమి పార్టీలు ప్రకటించాయి. దీనిని బట్టి చూస్తే ప్రభుత్వం మారితే రైతుగా మాకు మరింత లబ్ధి కలిగే అవకాశం కలుగుతుంది. మిగిలిన వర్గాల్లోనూ అదే ఆశ ఉంది. ఈ తరుణంలో రాష్ట్రంలో పాలకులు మారితేనే బాగుంటుందనే అభిప్రాయంతో ఉన్నాను.

- పీటా రాంబాబు, రైతు, రాజేంద్రపాలెం, కొయ్యూరు

ఏం చేశారని జగన్‌కు ఓటు వేయాలి



ఏం అభివృద్ధి చేశారని జగన్‌కు ఓట్లు వేయాలి. రోడ్లు వేశారనా?, లేక భూముల రీసర్వేలో పాస్ పుస్తకాలపై ఆయన ఫొటో పెట్టుకున్నారనా?, విద్యుత్ చార్జీలు ఒకటికి మూడింతలు పెంచారనా..ఏం చూసి వైసీపీకి ఓటు వేయాలి. గ్రామం విడిచి ఎక్కడికి వెళ్లాలన్నా గతుకుల రోడ్లపై అవస్థలే. వైసీపీ ప్రభుత్వం రైతులకు చేసిన మేలు ఏమిటి?. మరోసారి ఆ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతిపాలే. గత టీడీపీ హయాంలో బోర్లు వేశారు. చెరువులు అభివృద్ధి చేశారు. ఇప్పుడు మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో రైతులకు అన్నివిధాలా మేలు జరుగుతుందని భావిస్తున్నా. అందుకే టీడీపీకే నా ఓటు వేసి తీరుతాను.

- కలగ రామరాజు, రైతు, గుమ్మాళ్లపాడు, రావికమతం మండలం

ఐదేళ్లుగా పనులు దొరకడం లేదు



మాలాంటి వాళ్లం బతకలేకపోతున్నాం. పప్పులు, ఆయిల్, కూరగాయలు...ఇలా అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ముఖ్యంగా పనులు దొరకడం లేదు. కనీసం పని ఉంటే అంత ఇబ్బందిగా ఉండదు. చేద్దామన్న ఐదేళ్లుగా సరైన పని దొరకడం లేదు. రోజంతా పనిచేస్తే వచ్చిన డబ్బుతో ఆ రోజే గడుస్తుంది. పని లేకపోతే చాలా ఇబ్బంది పడుతున్నాం. ఏదైనా కడితేనే మాకు పని ఉంటుంది. పని కల్పించే ప్రభుత్వానికి మాత్రమే నేను ఓటు వేస్తాను.

- ఎస్.రమణ, గాజువాక

రాష్ట్రాన్ని పునర్నిర్మించగల నాయకత్వం అవసరం



సంక్షేమంతో పాటు అభివృద్ధి చేసే సమర్థవంతమైన నాయకత్వానికే ఈ ఎన్నికల్లో నా మద్దతు. అసమర్థత, అవినీతి పాలనతో దెబ్బతిన్న రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయగల నాయకత్వం అవసరం. ఉపాధి లేమి, పెరిగిన నిత్యావసర ధరలు, పెంచిన విద్యుత్, ఆర్టీసీ చార్జీలు నడ్డివిరిచాయి. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో సాగు ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు కావడంతో తిరోగమనంలో పయనిస్తుంది. సుస్థిర అభివృద్ధి సాధించే విజన్ కలిగిన పాలకుడుకే ఈసారి నా మద్దతు.

- తమరాన శివకృష్ణ, రైతు, ఎల్‌బీపీ అగ్రహారం, బుచ్చెయ్యపేట మండలం

సంక్షేమంతో పాటు అభివృద్ధి జరగాలి



వైసీపీ ప్రభుత్వం సంక్షేమమే కాకుండా అభివృద్ధిపైన కూడా దృష్టి పెడితే బాగుండేది. గత ఐదేళ్లలో కేవలం సంక్షేమానికి పరిమితమైంది. అభివృద్ధి పెద్దగా కనిపించలేదు. రాజధానిపై కూడా స్పష్టత లేకపోవడంతో ప్రజలు అయోమయంలో ఉన్నారు. జోడెద్దుల మాదిరిగా సంక్షేమం, అభివృద్ధి జరిగినప్పుడే రాష్ట్రాభివృద్ధి జరుగుతుంది.

- కె.వెంకటలక్ష్మి, గృహిణి, శ్రీరామనగర్ కాలనీ, అనకాపల్లి

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి



కూటమి గెలిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నా యువకులు, ఉద్యోగులు, విద్యావంతుల్లో స్పందన కూడా చంద్రబాబునాయుడును తిరిగి ముఖ్యమంత్రిని చేయాలనేలా ఉంది. చంద్రబాబు, కేంద్రంలోని ప్ర ధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తారని నమ్ముతున్నా..అందుకే నేను ఎన్నికల్లో కూటమికే మద్దతిస్తాను.

- శివప్రసాద్, రామ్‌నగర్, విశాఖపట్నం

గిరిజన గ్రామాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు



వైసీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదు. ఐదేళ్లలో ఏనాడు వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీలు మా సమస్యలను అడిగింది లేదు. గత ఎన్నికల ముందు ఓట్లు అడిగేందుకే వచ్చారు, మళ్లీ రాలేదు. గ్రామాలకు రహదారులు, మంచినీటి పథకాలు లేవు. ఒక్కరికి కూడా పక్కా గృహం మంజూరు చేయలేదు. నిత్యావసర ధరలు బాగా పెరిగిపోయాయి. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వస్తే గిరిజనులకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నాం. ఈసారి కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని నిర్ణయించుకున్నాం.

- ముక్కలి వాసుదేవరావు, జీకేవీధి

పిల్లల భవిష్యత్తు కోసం టీడీపీకి ఓటు వేస్తా



2019 ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేశాను. ఈసారి పిల్లల భవిష్యత్తు కోసం టీడీపీకి ఓటు వేస్తాను. మా పిల్లలు డిగ్రీ పూర్తిచేశారు. వైసీపీ అధికారంలోకి వస్తే పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కానీ ఆ పరిస్థితులు లేవు. దీంతో ఈసారి ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని నిర్ణయించుకున్నాను. ఎన్నికల మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని టీడీపీ హామీ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది.

- ఊడి అప్పలరాజు, జి.కొత్తూరు జంక్షన్, గొలుగొండ మండలం

జగన్ కంటే చంద్రబాబు పాలన బాగుందనిపిస్తుంది



చంద్రబాబు పాలన చూశాం. జగన్ పాలన కూడా చూశాం. జగన్ పాలన కంటే చంద్రబాబు పాలన బాగుందనిపిస్తుంది. జగన్ వచ్చిన కొత్తలో ఇసుక లేక కార్మికులు చాలా ఇబ్బందిపడ్డారు. ధరల కూడా పెరిగాయి. చంద్రబాబు పాలనలో ఇలాంటి ఇబ్బంది ఎప్పుడూ లేదు. పథకాల పేరుతో ఒక చేత్తో డబ్బులిచ్చి మరొక చేత్తో లాక్కుంటున్నారనిపిస్తుంది. చంద్రబాబు కూడా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పథకాలు ఇచ్చారు. అప్పుడు పన్నులు, ధరలు పెద్దగా లేవు. ఈసారి మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. చంద్రబాబు పాలన వస్తే బాగుటుందని అనుకుంటున్నాను.

- కంబాపు మల్లమ్మ, గోపాలపట్నం

ఐటీని అభివృద్ధి చేయగలిగిన వారికే...



ఐటీ సెక్టార్‌లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఎక్కడో దూర ప్రాంతాల్లో ఉన్న ఐటీ సంస్థల్లో కంటే రాష్ట్రంలో ఐటీ సెక్టార్ అభివృద్ధి చేస్తే ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయి. అందువల్ల ఐటీ సెక్టార్‌ను అభివృద్ధి చేయాలనుకునే ఆలోచన ఉన్నవారికి ఓటువేసి గెలిపించుకుంటాం. రాష్ట్రాన్ని సాంకేతిరంగంలో అభివృద్ధి చేయగల దార్శనికత, శక్తి సామర్థ్యాలు ఉన్న అధినేత కావాలి. అలాంటివారిని ఎన్నికోవడం వల్ల అన్ని విధాలుగా మేలుజరుగుతుందని భావిస్తున్నాం.

- తాటికొండ ధరణి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని, నడుపూరు

జగన్ ప్రభుత్వ పనితీరు బాగానే ఉంది



మా ఊరు వరహా నదిపై వంతెన నిర్మించలేదు. కానీ జగన్ ప్రభుత్వం పనితీరు బాగానే ఉంది. అప్పులు చేసినా పేదవాళ్లకు పెడుతున్నాడు, రైతు భరోసా కింద వ్యవసాయానికి పెట్టుబడి ఇస్తున్నారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేస్తున్నాడు. ఏ పని అయినా వలంటీర్లు చేసి పెడుతున్నారు. ఇక ధరలంటారా ఏ ప్రభుత్వం వచ్చినా పెరుగుతాయి.

- శానాపతి బాబురావు, వ్యవసాయ రైతు, పందూరు, కోటవురట్ల మండలం

డబ్బులు వేయడం కాదు, అభివృద్ధి చూపించాలి



నేను ఏదైనా పనిమీద రోలుగుంట నుంచి చోడవరం వెళ్లాలంటే నరకం చూస్తున్నాను. సరైన రోడ్డు లేదు. ఈ ఐదేళ్లలో కనీసం పట్టించుకునే నాథుడే కనిపించలేదు. ప్రజలకు పథకాల ద్వారా ఖాతాల్లో డబ్బులు వేయడం కాదు, అభివృద్ధి కూడా చేసి చూపించాలి. నిత్యం ఈ రహదారిపై వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అంతా ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ఈసారి అభివృద్ధి చేసే పార్టీకే ఓటు వేస్తాను.

- ఉప్పలపు గణపతి, రోలుగుంట

మద్య నిషేధమన్నారు... ఎక్కడ?



జగన్ పాలనలో ధరలన్నీ ఆకాశంలో ఉన్నాయి. మాలాంటి సామాన్యులు ఇంకేం బతుకుతాం. మద్య నిషేధమన్నారు. అదీ లేదు. కుటుంబ యజమాని సంపాదించిన కూలి డబ్బుల్లో సగం మద్యానికే ఖర్చయిపోతోంది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం మారాలి. ఎన్నికల్లో కూటమికే ఓటేస్తాం.

- ఎకిరెడ్డి రమణమ్మ, కూలీ, తోటగరువు, ఆరిలోవ

కొత్త చట్టాల ద్వారా రైతులకు అన్యాయం



ఈసారి ఎన్నికల్లో ప్రభుత్వం మారాలి. జగన్ పాలనలో ఇబ్బందులు పడ్డాం. కొత్తగా భూ చట్టాలు తీసుకువచ్చి రైతులకు అన్యాయం చేస్తున్నారు. గతంలో రైతులకు సబ్సిడీలపై వ్యవసాయ పరికరాలు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా లభించడం లేదు. నిత్యావసర సరకుల నుంచి విద్యుత్ చార్జీల వరకు అన్నింటినీ పెంచేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే అందరికీ బాగుంటుంది. అందుకే మార్పు కోసం ఓటు కూడా ఈసారి టీడీపీకే వేస్తాను.

- బుద్ధా సత్యనారాయణ, రైతు, మాడుగుల

ఈ ప్రభుత్వం మారితేనే కడుపు నిండా భోజనం



ఈ ప్రభుత్వంలో ఒకరోజు పని ఉంటే రెండు రోజులు ఉండడం లేదు. భవన నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగిపోవడంతో పనులు పూర్తిగా తగ్గిపోయాయి. తాపీమేస్త్రీలకు పనులు లేకపోవడంతో వారి వెనుక పనులు చేస్తున్న మాకు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఉపాధి పనులకు వెళుతున్నాం. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గత ప్రభుత్వంలో కూలి పనులు చేతినిండా ఉండేది. ఈ ప్రభుత్వం మారితేనే మాకు కడుపు నిండా భోజనం దొరుకుతుంది.

- ఇటంశెట్టి దొరబాబు, రాచపల్లి, మాకవరపాలెం మండలం

మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే బాగుంటుంది



ఈ ప్రభుత్వంలో మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి. గతంలో ధాన్యం దళారులకు అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు వారితో పనిలేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించుకోగలుగుతున్నాం. ధాన్యం అమ్మిన ఇరవై రోజుల్లో డబ్బులు ఖాతాలో వేస్తున్నారు. నా భార్యకు గర్భసంచి ఆపరేషన్ నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రిలో చూపిస్తే రూ.50 వేలు అడిగారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేసి తిరిగి ప్రభుత్వమే రెండు దఫాలుగా రూ.నాలుగువేలు చొప్పున రూ.8 వేలు నేరుగా బ్యాంకు ఖాతాలో వేసింది. సచివాలయాల సేవలు కూడా బాగున్నాయి. మళ్లీ ఈ ప్రభుత్వం వస్తే బాగుంటుందని అనుకుంటున్నాను.

- మాకిరెడ్డి సత్తిబాబు, రైతు, అమలాపురం, నర్సీపట్నం మండలం

ప్రభుత్వం మారాలి



పెరిగిన నిత్యావసర ధరలు, కరెంటు బిల్లులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జనానికి డబ్బులు వేయడమే కాదు. అభివృద్ధి కూడా ఉండాలి. కూలి డబ్బులతో బతకడమే కష్టంగా ఉంటుంది. ప్రభుత్వం మారాలి. లేకపోతే వచ్చే రోజుల్లో కుర్రాళ్లకు భవిష్యత్తు ఉండదు.

- మొగసాల జగన్నాథరావు, వ్యవసాయ కూలి, సత్యవరం, పాయకరావుపేట మండలం

వరికి గిట్టుబాటు ధర లేదు



గ్రామీణ ప్రాంతాల్లో నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగిపోయాయి. అందుకు తగ్గ ఆదాయం లభించడం లేదు. ఏటా పెరుగుతున్న పెట్టుబడులతో వ్యవసాయం కష్టమవుతుంది. ఆరుగాలం కష్టపడి పండించిన వరికి గిట్టుబాటు ధర లేదు. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు కంటే అన్ని ధరలు అదుపులో ఉంచి, ఆదాయం పెంపు మార్గాలు చూడాలి. ఈసారి ప్రభుత్వం మారాలని మనోగతం.

- పైల పద్మ, మహిళా రైతు, పెందుర్తి

రాష్ట్రాన్ని బాగుపరిచే పార్టీకే నా ఓటు



రాష్ట్రంలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక యువత నిరాశలో ఉన్నారు. అన్నిరకాల నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోయి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తును బాగుపరిచి ప్రజలకు మంచి పాలన అందించే పార్టీకే నా ఓటు వేస్తాను.

- దంగేటి మహాలక్ష్మి, పాయకరావుపేట

ఈసారి వైసీపీకే ఓటు



నా కుమారుడు ప్రస్తుతం బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాలిటెక్నికలో ఏడాదికి రూ.30 వేలు చొప్పున మూడేళ్లకు మొత్తం రూ.90 వేలు ప్రభుత్వం చెల్లించింది. నా భార్యకు చేయూత పథకం కింద ఏడాదికి రూ.18,750 ప్రభుత్వం ఇచ్చింది. నాకు మంచి చేసిన వైసీపీకి ఈసారి ఓటు వేయాలనుకుంటున్నాను.

- బి.తవిటినాయుడు, చిరువ్యాపారి, పరవాడ

ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రభుత్వాలు ఏవైనా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు ఉండాలి. సంక్షేమ పథకాలు అవసరమే కానీ, ప్రజలను మరీ సోమరులుగా మార్చే విధంగా ఉండకూడదు. గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సరఫరా చేయాలి. గ్రామాల్లో రోగాలు ప్రబలకుండా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యాహక్కు చట్టం పక్కాగా అమలుచేయాలి. నైపుణ్యం కలిగిన నిరుపేద యువత ఉన్నత చదువులకు ప్రభుత్వం ఉచిత ఏర్పాట్లు చేయాలి. అటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటారు.

- గొర్లి రామకృష్ణ, లగిశెట్టిపాలెం, ఆరిపాక శివారు, సబ్బవరం మండలం

అప్పులు తప్ప అభివృద్ధి లేదు



గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదు. సంక్షేమ పథకాల అమలు పేరుతో ప్రభుత్వ ఆస్తులను ఇష్టానుసారంగా తాకట్టు పెట్టడంతో పాటు ప్రజల నెత్తిన అప్పుల భారం మోపారు. వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక బడింది. నిత్యావసర ధరలతో పాటు ఆర్టీసీ చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయి. మేనిఫెస్టోలో మద్యాన్ని నిషేధిస్తామన్నారు. మద్యం ధరలు పెంచి సామాన్యుల పొట్టకొట్టారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలోను ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈసారి కూటమికే నా మద్దతు ఉంటుంది.

- కె.సన్యాసిరావు, కార్మికుడు, అగనంపూడి

వర్షంతో ఊరట



కోటవురట్లలో కురుస్తున్న వర్షం

కోటవురట్ల, మే 10: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం నుంచి వడగాలులతో అల్లాడిన ప్రజానికి ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఉరుములు, మెరుపులతో గంట పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడబంతో ప్రజలు ఉపశమనం పొందారు. మండలంలోని కోటవురట్ల, కైలాసపట్నం, రాజుపేట, చౌడువాడ. గొట్టివాడ, లింగాపురం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గత ఏడాది డిసెంబరు 6వ తేదీన వర్షం కురిసింది. మళ్లీ ఐదు నెలల విరామణ తరువాత శుక్రవారం కురిసింది. ఈ వర్షానికి రహదారులు జలమయ్యాయి. డ్రైనేజీల్లో చెత్తచెదారం కొట్టుకుపోయింది. ఎంపీడీవో కార్యాలయం వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం కూరగాయల పంటలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అనకాపలి టౌన్‌లో.. పట్టణంలో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి 35.3 డిగ్రీల ఉష్ణోగ్రతతో అల్లాడుతున్న ప్రజానీకానికి ఈ వర్షం ఉపశమనం కలిగించింది. మధ్యాహ్నం మూడు గంటలకే ఆకాశమంతా మబ్బులు కమ్ముకున్నాయి. నాలుగు గంటల సమయంలో కురిసిన వర్షంతో రహదారులన్నీ తడిసి ముద్దయ్యాయి. లోతట్టు ప్రాంతాల వద్ద వర్షపునీరు నిలిచిపోవడంతో ఆ మార్గాల్లో రాకపోకలు సాగించే పాదచారులు ఇబ్బందులు పడ్డారు. విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద కొద్దిపాటి వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు కూడా సబ్‌వేలు మీదుగా రాకపోకలు సాగించాయి. వడగాడ్పులతో ఇబ్బందులు పడ్డ ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.



ఎలమంచిలి పట్టణంలో కురుస్తున్న వర్షం

ఎలమంచిలిలో.. పట్టణంలో శుక్రవారం అర్ధగంట కుండపోత వర్షం కురిసింది. వేసవి వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. వాతావరణం చల్లబడడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది.

వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

» టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత



నారీ భేరీ సమావేశంలో మాట్లాడుతున్న వంగలపూడి అనిత

నక్కపల్లి, మే 10: వైసీపీ పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఎంతో మంది ఇబ్బందులకు గురయ్యారని టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె నివాసం వద్ద జరిగిన నారీ భేరీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వంటింటికే పరిమితమైన మహిళలను డ్వాక్రా సంఘాల పేరుతో ప్రతీ ఇంటిలో సంపాదనపరులుగా చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టీడీపీ, కూటమి మేనిఫెస్టోలో కూడా మహిళల భద్రత, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్టు చెప్పారు. మరి కొద్దిరోజుల్లోనే జగన్‌ను ఇంటికి పంపేందుకు మహిళలంతా కంకణం కట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు రమాకుమారి, పలువురు పాల్గొన్నారు.

టీడీపీలో 30 కుటుంబాలు చేరిక

మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు శుక్రవారం టీడీపీలో చేరారు. నక్కపల్లిలో టీడీపీ పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత సమక్షంలో వీరంతా తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా అనిత మాట్లాడుతూ పార్టీలోకి చేరి, ఎన్‌డీఏ కూటమి విజయానికి కృషి చేసిన వారందరికి సముచిత స్థానం వుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, ఎ.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలో చేరిన అమలాపురంలోని పలు కుటుంబాలు

తవ్వవానిపాలేన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు



తవ్వవానిపాలెం సభలో ప్రసంగిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం,మే 10 : మండలంలోని తవ్వవానిపాలెం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని జనసేన పెందర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. తవ్వవానిపాలెంలో పారిశ్రామికవేత్త, జనసేన నాయకుడు బోకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పంచకర్లకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పంచకర్ల మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామంలో సమస్యలన్నీ పరిష్కరిస్తానని చెప్పారు. గాజుగ్లాసు గుర్తుపై తనకు, కమలం గుర్తుపై ఎంపీ అభ్యర్థికి ఓటేసే గెలిపించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు బోకం శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకోవాలంటే కేంద్రం సహకారం అవసరమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు కమలం, గాజుగ్లాసు గుర్తుల పై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గండి వంశీదీప్, సర్పంచ్ బోకం స్వామినాయుడు, మాజీసర్పంచ్ బోకం అప్పల నాయుడు, బోకం అర్జునుడు, గండి నారాయణబాబు, వనం దేముడు, బోకం బాలకృష్ణ, శరగడం రాము, దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు, కేవీ సత్యనారాయణ, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచకర్లకు పాస్టర్ల మద్దతు

మండలంలోని పలు చర్చిలకు చెందిన 30 మంది పాస్టర్లు జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లకు శుక్రవారం రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావును కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కూటమి విజయం సాధిస్తే పాస్టర్లకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు వరప్రసాద్, జి.జోషెఫ్‌రాజ్, పి.మనోహర్, వి.చేలాజ్, కె.మనోహర్, నాయకులు ఎం.మహాలక్ష్మీనాయుడు, సాలాపు వెంకటేశ్వరరావు, బంతికోల్ల పద్మ, గొర్లి కుమార్, కొటాన రమణ, జెట్టి ప్రసాద్, తీడ రవి, కర్రి కనకరాజు పాల్గొన్నారు.



పంచకర్ల వెంకటేశ్వరరావును కలిసి మద్దతు తెలుపుతున్న పాస్టర్లు

FORMAT C-1

(For candidate to publish in Newspapers, TV)

DECLARATION ABOUT CRIMINAL CASES

(As per the judgment dated 25" September, 2018, of Honourable Supreme Court in WP (Civil) No.536 of 2011(Public Interest Foundation & Ors.Vs.Union of India & Anr.)

Nameandaddressofcandidate : **ANITHA VANGALAPUDI,** D.NO:11-142, Plot No: 21, Krrish Township, Nakkapalli Village and Mandalam, Anakapalli District, Andhra Pradesh-531081

Name of political party : **TELUGU DESAM PARTY**

Name of Election : **AP General Elections – 2024**

Name of Constituency : **33-Payakaraopeta Assembly Constituency**

I **Anitha Vangalapudi**,acandidatefor the above mentioned election, declare for public information the following details about my criminalantecedents:

Sl. No.	Name of Court	Case No. And Dated	Status of Cases (s)	Section(s) of Acts concerned and brief description of offence(s)
1		FIR No. 434/202323/07/2023 Nandigama (PS) 14th Metropolitan Magistrate, Nandigama	Under Investigation	U/Sec.143,451,452,323,354,509,506 r/w 149 IPCAnitha Vangalapudi along With Other Accused broke the lock of the House gate and shouted loudly. They entered the house illegally by yelling and shouting horrible things
2		FIR No. 51/202216/03/2022 Nakkapalli (PS) Anakapalli District	Under Investigation	U/Sec.448, 341 r/w 34 IPCAnitha Vangalapudi Along With Other Accused Conducted Dharna in front of Vempadu toll plaza, entered on NH-16 road toll fee booths with screams and obstructed the vehicles which are came from Tuni towards Visakhapatnam.
3	Special Sessions Judge for Trail of Offences Under SC and ST (POA) Act. Cum IV ADJ Kadapa	Spl.S.C.N.O. 26/2022 31-03-2022 Adjournment Dt:-28/05/24	Call With MPs— Discharge Petition Pending	U/Sec.143,341,120(B),228(A) r/w149 SC,ST (POA) ACT 1989 3(1)(r)(s) Anitha Vangalapudi (A2) Along With Other Accused Conducted Dharna in front of Pulivendula Dy. SP Office and Arranged Press meet at R&B Guest House without Prior Permission about the Death of Nagamma who is SC Candidate on 19-12-2020
4		FIR No. 293/202124/11/2021	The Hon'ble High Court Issues Order in CP No. 6857 of 2021, directing the investigation officer to follow the processor under section 41 A CRPC2) Under Investigation on	U/Sec.188, 353, 153a, 505, 504, 269, 270 r/w 34 IPC, 3 PA-1922, 3EDA 1897, 51(b) DMA-2005, 30 PA-1861The accused and 16 others obstructed the police while discharging their duties and insulted police department and create fear, alarm to the public without following precautions. and disobey the promulgated by the police
5	JFCM Court Tuni, East Godavari District	FIR No:104/2021 Dt:09/07/2021 CC: 04/202327/01/2023	Charge Sheet Field and Pending Trail	U/Sec.188, 269, 270 IPCThe Accused and Others Violated the orders Promulgated by the Govt. with Regards to COVID and Negligently By Doing the Act. Know to be likely to Spread Infections of any Disease Dangerous to Life
6		FIR No. 503/2020, 12/05/20203 Town Police Station Visakhapatnam	Under Investigation	U/Sec.188, 269, 271 r/w 34 IPCThe Accused and 15 others violated the orders Promulgated by the Govt. with Regards to COVID and Negligently By Doing the Act. Know to be likely to Spread Infections of any Disease Dangerous to Life
7	VII SPL Magistrate Court-Visakhapatnam	CC:320/2019 16-04-2019 Adjournment Dt:-09/05/2024	Stay	Punishable Under Sec 138 and 142 Negotiable Instruments Act. And Section 190(1)(a) and 200 Cr.P.CThe complainant has initiated legal proceedings under sec 138 and 142 of the Negotiable Instruments Act, Alleging false claim. This matter is currently pending

(B) Details about cases of conviction for criminal offences.

Sl No	Name of Court & date(s)of order(s)	Description of offence(s) & Punishment imposed	Maximum PunishmentImposed
1	Not Applicable	Not Applicable	Not Applicable
2	Not Applicable	Not Applicable	Not Applicable
3	Not Applicable	Not Applicable	Not Applicable
4	Not Applicable	Not Applicable	Not Applicable
5	Not Applicable	Not Applicable	Not Applicable
6	Not Applicable	Not Applicable	Not Applicable
7	Not Applicable	Not Applicable	Not Applicable

sd/- ANITHA VANGALAPUDI
33-Payakaraopeta Assembly Constituency

చిప్పాడ నిర్వాసితులకు న్యాయం చేస్తా

» జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్



సుందరపు విజయకుమార్‌కు హారతి ఇస్తున్న మహిళలు

అచ్యుతాపురం, మే 10: చిప్పాడ పంచాయతీలో సెజ్ నిర్వాసితులకు తీరని అన్యాయం జరిగిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని చిప్పాడ పంచాయతీలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సుందరపు మాట్లాడుతూ.. బార్క్‌కు కేటాయించిన భూముల్లో చిప్పాడ పంచాయతీ వాసులంతా తమ భూములను కోల్పోయారన్నారు. కాని వీరికి సరైన పునరావాసం కల్పించలేదన్నారు. గ్రామం తరలిస్తామని అధికారులు గ్రామంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడంలేదన్నారు. ఇక్కడ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్వాసితులందరికీ పునరావాసంతో పాటు ఉపాధి కూడా కల్పిస్తామన్నారు. సుందరపు విజయకుమార్‌కు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, ఎంపీటీసీసభ్యుడు పైడి భాస్కరరావు, రాజాన రామునాయుడు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి

రాంబిల్లి, మే 10 : బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలిసి శుక్రవారం దిమిలిలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం శ్రీదేవి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాల ఇబ్బందులకు గురిచేసి, బతుకలేని పరిస్థితికి తీసుకువచ్చిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రతి కుటుంబానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాసు గుర్తుపైన ఓటువేసి గెలిపించాలని శ్రీదేవి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సుందరపు సత్యనారాయణ, పప్పల నూకన్నదొర, బైలపూడి శ్రీరామదాసు, కొటాపు వడ్డీకాసులు, కరణం శ్రీహరి, టీడీపీ నాయకులు దల్లమ్మదేవి పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు

పరవాడ, మే 10 : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మునగపాక మండలం వెంకటాపురం వద్ద గల క్లాసిల్ పరిశ్రమకు ముడిసరుకును తరలించే భారీ వాహనాలన్నీ పరవాడ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రహదారి గుండా భారీ వాహనాలకు అనుమతులు లేకపోయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. దీనివల్ల తరచూ ప్రమాదాలతో పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అలాగే రహదారి కూడా దెబ్బతింటుంది. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి భారీ వాహనాల రాకపోకలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నిజరూపంలో అప్పన్న దర్శనం

... 3వ పేజీ తరువాయి

జలాలతో సహస్ర ఘటాభిషేకాన్ని చేయగా, శనివారం తెల్లవారుజామున సంప్రదాయానుసారంగా మూడు మణుగుల (125 కిలోల) చందనపు ముద్దను అప్పన్న స్వామిపై తొలివిడత పూతగా అర్చకులు సమర్పించారు. దీంతో చందనోత్సవం పరిసమాప్తమైంది. చందనోత్సవం సందర్భంగా దేవదాయ శాఖ చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు. అప్పన్న నిజరూపాన్ని సుమారు 90 వేల మంది దర్శించుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మత్స్యకారులు దుర్మరణం

... 3వ పేజీ తరువాయి

పట్టుకున్నారు. అయితే రొయ్యల చెరువు యజమాని చెరువు చుట్టూ కంచెతో పాటు లైట్ల కోసం విద్యుత్ వైర్లు వేశాడు. విద్యుత్ వైర్లకు ఉన్న స్లీవ్‌లు పోవడంతో వీరిద్దరూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్థులు చూడడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సోమునాయుడు అవివాహితుడు కాగా, నూకరాజుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

బాలికా సాధికారతకు ఎన్టీపీసీ కృషి

» సంస్థ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, మే 10 : బాలికా సాధికారత కోసం సింహాద్రి ఎన్టీపీసీ ఎంతగానో కృషి చేస్తుందని సంస్థ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రికి చెందిన దీపాంజలినగర్‌లోని శకుంతల ఆడిటోరియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బాలికా సాధికారత మిషన్-2024 వర్క్‌షాపును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సీజీఎం మాట్లాడుతూ నెల రోజులు పాటు ఈ వర్క్‌షాపు జరుగుతుందన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తి చేసిన 120 మంది విద్యార్థినులను ఎంపిక చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీజీ విభాగం సీజీఎం ఆర్ఆర్ పరిదా, సింహాద్రి హెచ్ఆర్ విభాగం హెడ్ బీబీ పాత్ర, వివిధ విభాగాల జీఎంలు, దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజు సిన్హా తదితరులు పాల్గొన్నారు.

పీపీఎల్ క్రికెట్ టోర్నీ విజేత అనిల్ యూరోస్



విజేత జట్టుకు షీల్డ్‌ను అందజేస్తున్న మజ్జూరి నారాయణరావు

పాయకరావుపేట, మే 10: పాయకరావుపేట ప్రీమియర్ లీగ్ పేరుతో నిర్వహించిన కోనేటి సాయి మెమోరియల్ క్రికెట్ టోర్నీ విజేతగా అనిల్ యూరోస్ టీం నిలిచింది. స్థానిక వాటర్ క్రాసింగ్ గ్రౌండ్‌లో సీనియర్ క్రికెటర్ గొల్లపల్లి నాగు నేతృత్వంలో 15 రోజులుగా జరుగుతున్న ఈ క్రికెట్ టోర్నీలో ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో కిశోర్ కింగ్స్ జట్టుపై అనిల్ యూరోస్ టీం ఆరు పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా తుని, పాయకరావుపేట భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు, వికాస తరంగిణి సభ్యులు చిక్కాల శ్రీనివాసరావు, సీనియర్ క్రికెటర్ కొనిరెడ్డి రాకేష్ విన్నర్, రన్నర్ జట్లకు షీల్డ్‌లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ప్లేయర్స్ యజ్జల చంద్రశేఖర్, ఎం.అరుణ్, జీవీఎల్ఎస్.రమేశ్, యోహాన, పి.చిన్న, సీహెచ్.బాబూరావు, అనిల్, కిషోర్ పాల్గొన్నారు.

'పేట'లో ప్రజాగళం పాదయాత్ర

పాయకరావుపేట/రూరల్, మే 10 : పట్టణంలో ఎన్డీఏ కూటమి నాయకులు శుక్రవారం ప్రజాగళం పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే ఎంపీ నమూనా బ్యాలెట్ కరపత్రాలను అందజేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితకు సైకిల్ గుర్తుపైనా, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌కి కమలం గుర్తుపైనా ఓట్లువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెదిరెడ్డి నాగవెంకటరమణ, మలిపెద్ది సతీష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నామవరంలో ఉపాధి కూలీలను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది ఉపాధి కూలీలకు మజ్జిగ, కూల్ డ్రింక్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ పల్లా బాబూరావు, గొర్ల బాబ్జీ, ఈగల సూర్యనారాయణ, షేక్ వి.సాహెబ్ పాల్గొన్నారు.

రెండు మండలాల్లో కేంద్ర బలగాల కవాతు



మెయిన్‌రోడ్డులో మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

పాయకరావుపేట/రూరల్, మే 10: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని మెయిన్‌రోడ్డుతో పాటు మండలంలో మంగవరం, శ్రీరాంపురం, వెంకటనగరం, రాజవరం గ్రామాల్లో పోలీసులు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ పి.అప్పలరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

కశింకోటలో.. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు కశింకోట, తాళ్లపాలెం, పరవాడపాలెం, వెదురుపర్తి గ్రామాల్లో శుక్రవారం సీఐ వినోద్‌బాబు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.రమేష్‌బాబు, 60 మంది సీఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కుమార్



ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గం

అనకాపల్లి టౌన్, మే 10: అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎంజేవీఎస్ కుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం బార్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన నూతన కార్యవర్గం ఎన్నికల్లో కుమార్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షునిగా రోజా, కార్యదర్శిగా దుర్గారావు, సహాయ కార్యదర్శిగా తులసీ, కోశాధికారిగా సందీప్ ఎన్నికయ్యారు. లైబ్రేరియన్‌గా జగపతి, స్పోర్ట్స్ సెక్రటరీగా మోహన్, లేడీ రిప్రజెంటేటివ్‌గా కుసుమ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మల్లేష్, రామచంద్రరావు, నరసింహం, తేజ, లీలా ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని న్యాయవాదులు సత్కరించారు. ఎన్నికల అధికారిగా సాయిరామ్ ప్రభాకర్ వ్యవహరించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వుండాలి

నక్కపల్లి, మే 10: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలు అప్రమత్తంగా వుండాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి టి కె.గీతాంజలి చెప్పారు. శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. వారికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఓటింగ్ రోజు చాలా జాగ్రత్తగా వుండాలని, ఓటరు స్లిప్పుల పంపిణీ కూడా సకాలంలో చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓట్ల కోసం ప్రలోభాల వల

...3వ పేజీ తరువాయి

సమాచారం. ఎలమంచిలిలో వైసీపీ నేత తన గెస్ట్‌హౌస్‌కు గ్రామాల నుంచి వివిధ వర్గాలకు చెందిన ప్రజలను పిలిపించుకొని గంపగుత్తగా ఓట్లు కొనుగోలు చేస్తున్నట్టు తెలిసింది. పెందుర్తి, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో ఓటుకు రూ.1000 నుంచి రూ.1500 ధర నిర్ణయించి పంపిణీ చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే కొన్ని గ్రామాలకు అధికార వైసీపీ నాయకులు డబ్బు పంపిణీ పూర్తి చేసినట్టు భోగట్టా. ఇంత జరుగుతున్నా ఎన్నికల అధికారులు నిఘా పెట్టకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.


రావికమతంలో భారీగా కురుస్తున్న వర్షం


రోలుగుంటలోని ఓ వీధిలో...

ఎండ వాత.. కుండపోత

▸ పలు మండలాల్లో విభిన్న వాతావరణం ▸ ఉదయం నుంచి భానుడు భగభగలు ▸ సాయంత్రం ఉరుములు, మెరుపులు, గాలులతో భారీ వర్షం

చోడవరం, మే 10 : వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో అంతటా చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు. చోడవరం మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతో సుమారు గంట పాటు భారీగా వర్షం పడింది. ప్రధాన రహదారులపై నీరు పారింది. ఈ కారణంగా పట్టణంలో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గురువారం రాత్రి కూడా పట్టణంలో కుండపోతగా వానపడింది. మండువేసవిలో ఎండలతో అల్లాడిపోతున్న జనం వర్షాలు కురుస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చెయ్యపేట : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ మండిపోవడంతో ప్రజలు ఇబ్బం దులు పడ్డారు. రెండు గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై గంట పాటు కురిసిన భారీ వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లపడింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత మూడు రోజులుగా అడపా దడపా వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు.


బుచ్చెయ్యపేట మండలం వడ్డాది కూడలిలో కురుస్తున్న వర్షం

రోలుగుంట : మండలంలోని శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. భగభగ మండే ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు చల్లదనంతో ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధిక ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ అనంతరం కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది.

రావికమతం : గత కొద్ది రోజులుగా ఎండలతో పాటు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మండల ప్రజలు శుక్రవారం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి భానుడు భగభగ మండినప్పటికీ సాయంత్రం ఐదు గంటలకు ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశమ మేఘావృతమై మబ్బులు కమ్ముకుని గాలులతో సుమారు అర్ధ గంటపాటు భారీగా వర్షం పడింది. దీంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది.

దేవరాపల్లి : రెండు రోజుల నుంచి మండలంలో వర్షాలు కురుస్తుండడంతో వాతావారణం చల్లబడింది. శుక్రవారం ఉదయం కూడా ఉష్ణతాపం అధికంగానే ఉంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై భారీగా వర్షం పడడంతో అంతా ఉపశమనం పొందారు. సరుగుడు, చెరకు, కూరగాయల పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు చెపుతున్నారు.

మాడుగుల/మాడుగుల రూరల్ : మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగింది. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడడంతో అంతటా చల్లబడింది. గాలులకు చెట్లకొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. గత రెండుమూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలు పండించేందుకు మేలు చేస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చీడికాడ : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ తీవ్రత కారణంగా జనం ఇబ్బందులకు గురయ్యారు. అనంతరం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం పడడంతో అంతటా చల్లబడింది. ఈ వర్షం వ్యవసాయ పనులకు ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

మాకవరపాలెం : మండలంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉన్నప్పటికీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో వర్షం పడడంతో అంతటా చల్లడింది. ఈ వర్షం సరుగుడు, కూరగాయల పంటలకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

పట్నం పసుపుమయం

▸ నర్సీపట్నంలో టీడీపీ భారీ రోడ్ షో ▸ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన కూటమి అభ్యర్థులు

▸ సీఎం రమేష్, అయ్యన్నపాత్రుడులకు బ్రహ్మరథం పట్టిన జనం ▸ నాలుగు మండలాల నుంచి భారీగా హాజరు


ర్యాలీలో పసుపు చొక్కాలు, జెండాలు, టోపీలతో నాలుగు మండలాల నుంచి హాజరైన టీడీపీ శ్రేణులు

నర్సీపట్నం, మే 10 : పట్టణం శుక్రవారం పసుపుమయమైంది. మాజీ మంత్రి, నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో భారీ రోడ్ షో నిర్వహించారు. సీబీఎం కాంపౌండ్ నుంచి మోర్ వరకు జరిగిన ఈ ర్యాలీలో అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అనంతరం భారీ బహిరంగ నిర్వహించారు. నాలుగు మండలాల నుంచి తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పసుపు కండువాలు ధరించి టీడీపీ జెండాలు, ప్లకార్డులు, పసుపు బెలూన్లు చేతబట్టి ఉత్సాహంగా ముందుకు సాగారు. కొమ్ము డ్యాన్సులు, కోలాట ప్రదర్శన, డప్పుల రీ సౌండ్‌తో మెయిన్ రోడ్డు హోరెత్తి పోయింది. అయ్యన్నపాత్రుడుతో పాటు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, సినీ నటుడు, జనసేన నాయకుడు పృథ్వీరాజ్, మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు. మునిసిపాలిటీ, నాలుగు మండలాల నుంచి తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలేసింది. మోర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ కిక్కిరిసి పోయింది. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్లు పద్మావతి, రాజేశ్, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రమేష్, అయ్యన్న

మద్యం దుకాణాల వద్ద బారులు తీరిన మందుబాబులు

మాడుగుల, మే 10 : సాధారణ ఎన్నికలకు 48గంటల ముందు మద్యం దుకాణాలు మూసేస్తారని భావించిన మందుబాబులు శుక్రవారం ఉదయం దుకాణాలు తెరువక ముందే మాడుగులలో క్యూకట్టారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన దగ్గర నుంచి నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. రోజువారీ టార్కెట్ పూర్తయిన వెంటనే మద్యం దుకాణాలు మూసివేస్తున్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మద్యం బాటిళ్ల కొనుగోలు చేసేందుకు మందుబాబులు బారులుతీరారు.


మాడుగులలో మద్యం దుకాణం వద్ద క్యూ

పకడ్బందీగా పోలింగ్ సామగ్రి పంపిణీ


పోలింగ్ ఏర్పాట్లపై సమావేశం నిర్వహిస్తున్న ఆర్వో జయరాం

నర్సీపట్నం, మే 10 : పోలింగ్ సామగ్రి పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం సూచించారు. ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఏఈఆర్వోలు, డిప్యూటీ తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారుల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలన్నారు. ఆదివారం పోలింగ్ సామగ్రి పంపిణీ పకడ్బందీగా ఉండాలని వివరించారు. పోలింగ్ సిబ్బందిని వారికి కేటాయించిన బస్సులలో పోలింగ్ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. రూట్లు వారీగా బస్సులు పంపించాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి పక్కాగా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు.

ఉద్యోగం పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ఎండాడ, మే 10 : నగర పోలీస్ కమిషనరు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి యువ కుడ్ని మోసం చేసిన వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. నగర పోలీసు కమిషనరు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి శ్రీకాకుళం జిల్లాకు చెందిన నామాలపూరి మోహనరావు ఓ యువకుడి దగ్గర నుంచి పలు దపాలుగా రూ. 30 వేల వసూలు చేశాడు. చివరికి అతనికి నగర పోలీసు కమిషనరు రవిశంకర్ పేరుతో ఫేక్ జాయినింగ్ లెటర్ ఇచ్చాడు. ఈ విషయమై ఆ యువకుడు తనకు తెలిసిన వారి ద్వారా విచారణ చేయగా పోలీసు కమిషనరేట్‌లో ఎటువంటి కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు లేవని, ఆ లెటర్ ఫేక్ అని తెలియడంతో సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సాంకేతికతను వినియోగించి ఫేక్ లెటర్ పంపిన మోహనరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నిజరూపంలో అప్పన్న దర్శనం

... 3వ పేజీ తరువాయి

జలాలతో సహస్ర ఘటాభిషేకాన్ని చేయగా, శనివారం తెల్లవారుజామున సంప్రదాయానుసారంగా మూడు మణుగుల (125 కిలోల) చందనపు ముద్దను అప్పన్న స్వామిపై తొలివిడత పూతగా అర్చకులు సమర్పించారు. దీంతో చందనోత్సవం పరిసమాప్తమైంది. చందనోత్సవం సందర్భంగా దేవదాయ శాఖ చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు. అప్పన్న నిజరూపాన్ని సుమారు 90 వేల మంది దర్శించుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఓట్ల కోసం ప్రలోభాల వల

... 3వ పేజీ తరువాయి

సమాచారం. ఎలమంచిలిలో వైసీపీ నేత తన గెస్ట్‌హౌస్‌కు గ్రామాల నుంచి వివిధ వర్గాలకు చెందిన ప్రజలను పిలిపించుకొని గంపగుత్తగా ఓట్లు కొనుగోలు చేస్తున్నట్టు తెలిసింది. పెందుర్తి, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో ఓటుకు రూ.1000 నుంచి రూ.1500 ధర నిర్ణయించి పంపిణీ చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే కొన్ని గ్రామాలకు అధికార వైసీపీ నాయకులు డబ్బు పంపిణీ పూర్తి చేసినట్టు భోగట్టా. ఇంత జరుగుతున్నా ఎన్నికల అధికారులు నిఘా పెట్టకపోవడంపై ఆరోపణలు విని పిస్తున్నాయి.

ఇద్దరు మత్స్యకారులు దుర్మరణం

... 3వ పేజీ తరువాయి

పట్టుకున్నారు. అయితే రొయ్యల చెరువు యజమాని చెరువు చుట్టూ కంచెతో పాటు లైట్ల కోసం విద్యుత్ వైర్లు వేశాడు. విద్యుత్ వైర్లకు ఉన్న స్లీవ్‌లు పోవడంతో వీరిద్దరూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్థులు చూడడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సోమునాయుడు అవివాహితుడు కాగా, నూకరాజుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

వచ్చే నెల 18న మాడుగుల మోదకొండమ్మ జాతర

▸ శతకంపట్టు వద్ద భక్తిశ్రద్ధలతో రాటోత్సవం

మాడుగుల, మే 10 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ జాతర జూన్ 18వ తేదీన జరగనుంది. ఇందుకు సంబంధించి ఇక్కడి శతకంపట్టు వద్ద ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం ముహూర్తపు రాటను వేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 19న అమ్మవారి జాతర చాటింపు, 21న ఆలయం నుంచి అమ్మవారి ఘటాల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ శ్రీనివాసరావు, భీమరశెట్టి పైడియ్యనాయుడు తదితర పదహారు మంది కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


శతకంపట్టు వద్ద ముహూర్తం రాట వేస్తున్న కమిటీ సభ్యులు

కూటమి తరపున బుల్లితెర నటులు ప్రచారం


కె.కోటపాడులో ప్రచారం చేస్తున్న బుల్లితెర నటుడు నిరుపమ్ (డాక్టర్ బాబు)

దేవరాపల్లి/కె.కోటపాడు, మే 10 : మాడుగుల నియోజకవర్గంలోని పలు మండలాల్లో బుల్లితెర నటీనటులు శుక్రవారం సందడి చేశారు. దేవరాపల్లిలోని పెట్రోల్ బంక్ నుంచి ప్రధాన కూడలిలో కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణకు మద్దతుగా ప్రచారం సాగించారు. కార్తీక దీపంలో డాక్టర్ బాబుగా నటించిన నరుపమ్, అతని భార్య మంజులతో పాటు, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ భార్య శ్రీదేవి, బండారు సత్యనారాయణమూర్తి భార్య మాధవిలత పలువీధుల్లో ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ కృష్ణమూర్తి, మహేశ్వరీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే కె.కోటపాడులో బుల్లితెర నటీనటులతో పాటు ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరి విజయ తదితరులు ప్రచారం సాగించారు. స్థానిక మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీనరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభయ హస్తం నగదు వలంటీరు స్వాహా

▸ పాత కృష్ణాదేవిపేటకు చెందిన వృద్ధురాలు ఆరోపణ

▸ విచారణ జరిపి అధికారులు న్యాయం చేయాలని వేడుకోలు


బాధితురాలు వరహాలమ్మ

కృష్ణాదేవిపేట, మే 10: అభయ హస్తం పథకం కింద వచ్చే పింఛన్ నగదును గ్రామ వలంటీరు (ప్రస్తుతం రిజైన్ చేసిన) స్వాహా చేసినట్టు ఓ వృద్ధురాలు శుక్రవారం విలేకరుల వద్ద వాపోయింది. ఇందుకు సంబంధించి ఆమె తెలిపిన వివరాలివి. గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేటలో ఉంటున్న బొప్పాది వరహాలమ్మ వృద్ధురాలు. ఈమెకు వృద్ధాప్య పింఛన్ అందించినప్పటికీ గ్రామ వలంటీరు పి.సత్యప్రియ నెలల తరబడి అభయహస్తం పింఛన్ నగదు రూ.ఐదు వందలను ఇవ్వడం లేదు. ఇదిలావుంటే, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున స్థానిక సచివాలయ వెల్ఫేర్ ఉద్యోగి చిటికెల అప్పలనాయుడు ఏప్రిల్ నెలకు సంబంధించి వృద్ధాప్య పింఛన్ రూ.మూడు వేలతో పాటు అభయ హస్తం పింఛన్‌ను రూ.ఐదు వందలను గత నెల సదరు వృద్ధురాలికి ఇచ్చారు. దీంతో తనకు అభయ హస్తం పింఛన్‌ను గ్రామ వలంటీరు ఇంతవరకు ఇవ్వలేదని ఆమె గుర్తించి, అతని వద్ద వాపోయింది. మే నెలకు సంబంధించి ఈ పింఛన్ల మొత్తం రూ.3,500 వృద్ధురాలు వరహాలమ్మ అకౌంట్ జమైంది. దీంతో ఈమె కుటుంబ సభ్యులు ఈ విషయమై ఆరా తీయడం ఆరంభించారు. ఇది తెలుసుకున్న ప్రస్తుతం రాజీనామా చేసి ఉన్న సదరు వలంటీరు సత్యప్రియకు ఆ వృద్ధురాలి వద్దకు వెళ్లి ఎని మిది నెలలకు సంబంధించి అభయ హస్తం పింఛన్ నగదు రూ.నాలుగు వేలను ఇవ్వబోయింది. కానీ ఆమె తీసుకో లేదు. ఇన్నాళ్లూ తనకు ఈ పింఛన్ ఎందుకు ఇవ్వలేదని నిలదీసింది. అనంతరం ఆ వృద్ధురాలు కుటుంబీకులు సచివాలయం, వెలుగు అధికారులను కలిసి జరిగిన విషయాన్ని వారి దృష్టికి తీసుకు వెళ్లారు. వరహాలమ్మకు 2019లో అభయ హస్తం పథకం మంజూరైందని, మధ్యలో నిలుపుదల చేశారని వారు తెలిపారు. తిరిగి 2023 అక్టోబర్ నుంచి ఈ పథకం కింద పింఛన్ వస్తున్నట్టు ఆన్‌లైన్‌లో ఉందని వారు వివరించారు.

ఇదిలావుంటే, ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్మయిని వివరణ కోరగా, సదరు వలంటీరు రాజీనామా చేసిందని, కనుక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

'విద్యకు ప్రభుత్వాల ప్రోత్సహం కరువు'

దేవరాపల్లి, మే 10 : విద్యను ప్రోత్సహించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని నియోజకవర్గ రిక్షా కార్మిక సంఘం అధ్యక్షుడు గరికిన ఎల్లారావు ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నిరుద్యోగ సమస్య అధికమైందన్నారు. ఏఐటీయూసీ కార్యదర్శి రాయి సింహాద్రి మాట్లాడుతూ విద్యార్థులు చదవడానికి అవసరమయ్యే బ్యాంకు రుణాలు కల్పించడంతో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వారితో బండారు, గవిరెడ్డి, పైలా

మాడుగుల రూరల్, మే 10 : మండలంలోని తాటిపర్తి, శంకరం, జాలంపల్లి గ్రామాల్లోని పలువురు వైసీపీ నుంచి శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి మాడుగుల నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే ఎం.కోడూరులో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ సమక్షంలో పలువురు జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నాయకులు పైలా ప్రసాదరావు, అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, పుప్పాల అప్పలరాజు, అప్పాన రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లు పరిశీలించిన ఎంపీడీవో


బీఎల్‌వోకు సూచనలిస్తున్న ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు, మే 10 : మండల కేంద్రం కె.కోటపాడులోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ఎస్.అప్పలరాజు, ఎంఈవో డీవీడీ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఏర్పాట్లపై బీఎల్‌వోలతో చర్చించారు. పోలింగ్ స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు ఉండాలని, పోలింగ్ సిబ్బందికి మధ్యాహ్నం భోజన సదుపాయాలు కల్పించాలని సూచించారు.

మాధవనగరంలో పూరిల్లు దగ్ధం

నాతవరం, మే 10 : మాధవనగరంలో శుక్రవారం పూరిల్లు దగ్ధమైంది. పత్తల అచ్చియ్యమ్మ అనే మహిళకు చెందిన ఇంటి నుంచి ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్న బట్టలు, సామగ్రి మొత్తం కాలి బూడిదయ్యాయి. దీంతో బాధితురాలు కట్టుబట్టలతో మిగిలింది. ప్రభుత్వం తక్షణమే తనను ఆదుకోవాల్సిందిగా వేడుకుంది.

అదృశ్యమైన ముగ్గురు బాలురు ఇంటికి చేరిక


చోడవరం, మే 10 : పట్టణ శివారులో ఉంటున్న మూడు కుటుంబాలకు చెందిన ముగ్గురు బాలురు గురువారం నుంచి కనిపించకపోవడం కలకలం రేగింది. చివరకు వీరు చోడవరంలోనే తిరుగుతుండడంతో పోలీసులు వారిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. చోడవరం శివారు చుక్కావారి కళ్లాల్లో నివాసం ఉంటున్న వ్యవసాయ కూలీల కుటుంబాలకు చెందిన ఈ ముగ్గురు బాలురు గురువారం ఉదయం ఆడుకోవడానికి ఇంటి నుంచి బయటకు వచ్చారు. సాయంత్రం వరకు తిరిగి చేరకపోవడంతో తల్లిదండ్రులు వెతకసాగారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వాట్సాప్ గ్రూపులలో వారి ఫొటోలను పోలీసులు షేర్ చేశారు. ఈ నేపథ్యంలో పట్టణ శివారు నరసయ్యపేట పంట పొలాల వద్ద ఈ ముగ్గురు బాలలు తిరుగుతుండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఏపీఎల్ రైజింగ్ స్టార్స్ ట్రయల్స్‌కు స్పందన


ట్రయల్స్‌లో బౌలింగ్ చేస్తున్న యువ క్రికెటర్

మధురవాడ, మే 10 : మారుమూల ప్రాంతాల్లోని యువ క్రికెటర్ల కోసం ఏసీఏ వీఎంపాలెం ఏసీఏవీడీసీఏ బి గ్రౌండ్‌లో శుక్రవారం ట్రయల్స్ నిర్వహించారు. ఈ సందర్భం గా ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ట్రయల్స్‌లో పాల్గొనడానికి రాష్ట్రం నలుమూలలు నుంచి యువత పెద్ద ఎత్తున తరలి వచ్చారన్నారు. వారికి బి గ్రౌండ్‌లో ఆయా ప్రాంతాల ఫ్రాంచైజీల, సెలక్టర్లు బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో ఆట తీరును పరిశీలించారని చెప్పారు. విశాఖతో పాటు గుంటూరు జిల్లా మంగళగిరిలోనూ ఏపీఎల్ సీజన్-3 కోసం ట్రయల్స్ నిర్వహించినట్టు చెప్పారు.

ఎట్టకేలకు అందుబాటులోకి ఎలక్ట్రిక్ బస్సు



సింహాచలం, మే 10 : సింహాచలం దేవస్థానం పరిధిలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలన్న ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు ఆకాంక్ష ఎట్టకే లకు నెరవేరింది. గత ఏడాది జరిగిన పాలక మండలి సమావేశంలో ఒక్కొక్క బస్సుకు రూ. 1.3 కోట్లు వెచ్చించి రెండు బస్సులు కొనుగోలు చేయాలని దేవస్థానం అధికారులు నిర్ణయించి, సంబంధిత కంపెనీకి వర్కు ఆర్డర్ జారీ చేసి అడ్వాన్సుగా కొంత మొత్తాన్ని చెల్లించారు. ఈమేరకు చందనోత్సవం వేళ ఒక బస్సును కంపెనీ సింహాచలం చేర్చింది. దానికి అవసరమైన చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రసాద పథకం నిధులతో చేపట్టాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు.